జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

NIZAMABAD EDITION

నిజామాబాద్ | మంగళవారం 11 ఆగస్టు 2026 | సంపుటి : 16 | సంచిక : 190 | పేజీలు : 8 | వెల : 1/- | RNI No. TELTEL/2010/35558

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతిపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA    http://www.prajajyothinews.com    Mail: prajajyothidaily@gmail.com

## జైల్‌భరోతో దద్దరిల్లిన

# కామారెడ్డి



- కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై భారీ నిరసన
- లేబర్ కోడులను రద్దు చేయాలి.. పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి
- వ్యవసాయ రంగాన్ని కాపాడాలి.. రైతులు, కార్మికుల హక్కులను పరిరక్షించాలి
- అడుగడుగునా పోలీసుల అరెస్టులు
- తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు అక్రమ అరెస్టులతఉద్యమాలను అడ్డుకోలేరు
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్




**కామారెడ్డి, టౌన్ ఆగస్టు 10 ప్రజా జ్యోతి**

కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన జైల్‌భరో కార్యక్రమం ఉద్రిక్త పరిస్థితుల మధ్య కొనసాగింది. కార్మిక చట్టాల రద్దు, లేబర్ కోడుల అమలు, వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికుల హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ వివిధ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కేంద్రంలో పెద్ద సంఖ్యలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు సమీకరించి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జైల్‌భరో కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అయితే పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అడుగడుగునా పోలీసులు అరెస్టులు చేపట్టడంతో నిరసనకారులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు తమకు ఉందని, ప్రజాస్వామ్య పద్ధతిలో చేపట్టిన ఆందోళనను అడ్డుకోవడం సరికాదని నాయకులు పోలీసుల చర్యలను నిరసించారు.

### ప్రజా ఉద్యమాలను అరెస్టులతో అడ్డుకోలేరు

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజల సమస్యలపై శాంతియుతంగా పోరాటం చేస్తుంటే అక్రమ అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపడం ఎవరి వల్లా సాధ్యం కాదని స్పష్టం చేశారు. కార్మిక వర్గం ఎన్నో సంవత్సరాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను బలహీనపరిచే విధంగా లేబర్ కోడులను తీసుకురావడం సరికాదని ఆయన అన్నారు. లేబర్ కోడులను రద్దు చేసి, గతంలో అమలులో ఉన్న కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పని ప్రదేశాల్లో రక్షణ, సామాజిక భద్రత వంటి హక్కులను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న ఉద్యమాలను అణచివేయకుండా వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. - మిగతా3లో

## కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

- కోడి పంద్యాల నిర్వహిస్తున్న 12 మంది అరెస్ట్
- 9ద్విచక్ర వాహనాలు,3కార్లు, 11మొబైల్ ఫోన్లు
- 45,050 నగదు,65 కోడి పంద్యాల కత్తులు స్వాధీనం

4



## ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి

- ఓటర్ల జాబితా ఖచ్చితత్వం, పారదర్శకతకు పెద్దపీట
- 6,96,006 మంది ఓటర్లకు 100 శాతం ఫారాల పంపిణీ
- 6,11,568 ఫారాల డిజిటైజేషన్ పూర్తి
- ముసాయిదా జాబితాను ప్రతి ఓటరూ తప్పనిసరిగా పరిశీలించాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి టౌన్ ఆగస్టు 10 (ప్రజాజ్యోతి)**

భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) కామారెడ్డి జిల్లాలో విజయవం తంగా పూర్తయిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఓటర్ల జాబితాలో ప్రతి అర్హుడి పేరు ఉండేలా చూడటంతో పాటు, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే నమోదైన వారు, గైర్హాజరైన ఓటర్లు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితంగా నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలోని జుక్కల్, యెల్లారెడ్డి, కామారెడ్డి మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న మొత్తం 796 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన 6,96,006 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల ముద్రణ, పంపిణీ 100 శాతం పూర్తయినట్లు కలెక్టర్ - మిగతా2లో

## కాంగ్రెస్‌లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు

# సముచిత గుర్తింపు



- అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి..
- కొంత ఆలస్యం కావచ్చు కానీ అన్యాయం జరగదు
- రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- కాంగ్రెస్ అంటే రైతులు.. రైతులు అంటే కాంగ్రెస్
- కామారెడ్డి పి ఏ సి ఎస్ నూతన చైర్మన్‌గా గూడెం శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకారం
- చైర్మన్‌తో పాటు 13 మంది నూతన డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం
- ఘనంగా అభినందన, సన్మాన కార్యక్రమం

4

# ఎడపల్లి గౌడ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.



**ఎడపల్లి, ఆగస్టు 10(ప్రజాజ్యోతి):** ఎడపల్లి గ్రామ గౌడ కౌండిన్య సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం సభ్యుల సమక్షంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా ఆర్. ఎల్లా గౌడ్, అధ్యక్షులుగా కే. దయానంద్ గౌడ్, ఉపాధ్యక్షులుగా అంకుల్ సాయి గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కందునూరి నవీన్ గౌడ్, కోశాధికారిగా ఎం. శేఖర్ గౌడ్, ప్రధాన సలహాదారుగా ఎం. నటరాజ్ గౌడ్, సలహాదారులుగా లక్ష్మీ నరస గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, గౌడ సంఘం సభ్యుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. నూతన కమిటీ ఎన్నికపై సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# భక్తిశ్రద్ధలతో కావడి పాదయాత్ర కందకుర్తి త్రివేణి సంగమం నుంచి ఏకచక్రేశ్వరాలయం వరకు



**ప్రజా జ్యోతి బోధన్, ఆగస్టు 10:** శివుడిపై ఉన్న అపారమైన భక్తి, విశ్వాసంతో బోధన్ పట్టణానికి చెందిన బాల్జీత్ సింగ్ వాల్మీకి పవిత్ర కావడి పాదయాత్ర చేపట్టారు. రేంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి, మంజీరా, హరిద్ర నదుల పవిత్ర సంగమమైన త్రివేణి సంగమం వద్ద నుంచి గంగాజలాన్ని కావడిలో తీసుకుని భక్తిశ్రద్ధలతో పాదయాత్రగా బోధన్ పట్టణానికి బయలుదేరారు. కావడిని భుజాన వేసుకుని, శివనామస్మరణ చేస్తూ, భక్తి భావంతో అడుగులు వేస్తూ ఆయన పాదయాత్రను కొనసాగించారు. మార్గమధ్యంలో పలువురు భక్తులు ఆయనను అభినందిస్తూ, యాత్ర విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఎండ, అలసటను లెక్కచేయకుండా శివుడిపై ఉన్న విశ్వాసంతో యాత్రను కొనసాగించడం భక్తులను ఆకట్టుకుంది. కందకుర్తి త్రివేణి సంగమం నుంచి ప్రారంభమైన ఈ పవిత్ర పాదయాత్ర బోధన్ పట్టణంలోని ప్రసిద్ధ ఏకచక్రేశ్వరాలయం వరకు కొనసాగింది. ఆలయానికి చేరుకున్న అనంతరం కావడిలో భద్రంగా తీసుకొచ్చిన పవిత్ర గంగాజలంతో ఏకచక్రేశ్వర స్వామివారికి అభిషేకం నిర్వహించారు. శివునికి పవిత్ర జలంతో అభిషేకం చేయడం ద్వారా స్వామివారి ఆశీస్సులు లభిస్తాయని, కుటుంబ సభ్యులకు సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ ఈ కావడి యాత్ర చేపట్టినట్లు బాల్జీత్ సింగ్ వాల్మీకి తెలిపారు. భక్తి, ఆధ్యాత్మికత, శివనామస్మరణతో సాగిన ఈ కావడి పాదయాత్ర స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. త్రివేణి సంగమం నుంచి పవిత్ర జలాన్ని తీసుకుని పాదయాత్రగా ఏకచక్రేశ్వరాలయానికి చేరుకుని స్వామివారికి అభిషేకం చేయడం పట్ల పలువురు భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ యాత్ర భక్తిలోని విశ్వాసానికి, ఆధ్యాత్మిక నిబద్ధతకు ప్రతీకగా నిలిచిందని స్థానికులు పేర్కొన్నారు.

# హామీ ఇచ్చారు.. మాట నెరవేర్చారు!

**బీర్కూర్ స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం**



**బీర్కూర్, ప్రజాజ్యోతి, ఆగస్టు 10:** దశాబ్దాలుగా విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బీర్కూర్ స్మశాన వాటికకు ఎట్టకేలకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. దీంతో దహన సంస్కారాల సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగనున్నాయి. స్మశాన వాటికలో విద్యుత్‌తో పాటు నీటి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మండల యువజన నాయకుడు మియాపురం శశికాంత్, సీనియర్ నాయకుడు మేకల విట్టల్ దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే సమస్యను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విషయంపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత విద్యుత్ అధికారులను ఆదేశించడంతో ట్రాన్స్‌కో అధికారులు తక్షణమే చర్యలు చేపట్టారు. స్మశాన వాటిక వరకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకొచ్చారు. స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని నాయకులు గ్రామస్తులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, యువజన నాయకుడు శశికాంత్, మేకల విట్టల్‌తో పాటు పట్టణ అధ్యక్షుడు కోరిమే రఘు, దుంపల రాజు, వార్డు మెంబర్ ఆనంద్ తదితరులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# దళిత, గిరిజన జర్నలిస్టులందరూ సిరిసిల్లకు తరలిరావాలి

**దళిత, గిరిజన జర్నలిస్టుల హక్కుల సాధనే లక్ష్యం**

**తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న**

**బీర్కూర్, ప్రజాజ్యోతి, ఆగస్టు 10:** తెలంగాణ రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టులంతా ఏకతాటిపైకి వచ్చి తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న అన్నారు. నేడు రాజన్న సిరిసిల్లలో నిర్వహించనున్న జిల్లా మహాసభకు రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టులందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గంగన్న మాట్లాడుతూ.. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ దళిత, గిరిజన జర్నలిస్టుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. సమాజానికి నాలుగో స్తంభంగా నిలిచే పత్రికా, మీడియా రంగాల్లో విధులు నిర్వహిస్తున్న దళిత, గిరిజన జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. దళిత, గిరిజన జర్నలిస్టులకు రావాల్సిన హక్కులు, గౌరవం, అవకాశాల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాటం చేయడమే తమ ప్రధాన ఉద్దేశమన్నారు. దళిత, గిరిజన జర్నలిస్టుల హక్కుల సాధనలో భాగంగానే 'చలో సిరిసిల్ల' కార్యక్రమాన్ని చేపట్టినట్లు గంగన్న తెలిపారు. రాజన్న సిరిసిల్లలో జరిగే జిల్లా మహాసభలో జర్నలిస్టుల సమస్యలు, హక్కులు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టులంతా ఈ కార్యక్రమానికి హాజరై ఐక్యతను చాటాలని, మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# వాగు ఉధృతి.. రైతుల గతి ఇదే!



**మహ్మద్‌నగర్/నిజాంసాగర్ ప్రజా జ్యోతి ఆగస్టు 10** మహ్మద్‌నగర్ మండలంలోని సింగీతం గ్రామ శివారులో ప్రవహిస్తున్న వాగు రైతులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. వాగు అవతల సుమారు 500 పంట పొలాలు ఉండటంతో వ్యవసాయ పనుల కోసం రైతులు ప్రతిరోజూ వాగు దాటాల్సి వస్తోంది. ప్రస్తుతం వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తెప్పపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.80 కోట్లతో పనులు చేపట్టినా ఇప్పటికీ పూర్తికాలేదు. వర్షాకాలంలో వాగు మరింత ఉధృతంగా మారితే పరిస్థితి ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులను సత్వరం పూర్తిచేసి తమ కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

# స్వతంత్ర సమరయోధుల స్మరణ కోసమే హర్ ఘర్ తిరంగా

**-- ప్రతి ఇంటి పై జాతీయ జండా ఎగరవేయాలి**

**-- కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి**



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజాజ్యోతి)** నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జాతీయ జండా ఎగురవేసిన కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ఈ సందర్భంగా కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర్య పోరాట యోధులను స్మరించుకుంటూ వారి త్యాగాలపై సాధించిన స్వాతంత్ర్యాన్ని నేటి తరం వారికి గుర్తు చేస్తూ రెపరెపలాడే జాతీయ జెండాను ప్రతి ఇంటిపై ఎగరవేయాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జాతీయ జండా ఆవిష్కరణ చేసినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరు తమ తమ ఇంటిపై జాతీయ జండా ఎగురవేసి దేశభక్తి నీ చాటుకోవాలని అన్నారు.

# గ్రామాల ఉపసర్పంచుల హక్కులను కాల రాస్తే ఊరుకునేది లేదు

**ఉపసర్పంచ్‌ల అధికారాలను రద్దు చేయాలని సర్పంచ్‌లు కోరడం ఎంతవరకు సమంజసం**



**ముప్కాల్,(ప్రజా జ్యోతి) ఆగస్టు10** ప్రజలు ఓట్లు వేసి ఎన్నుకున్న ఉపసర్పంచ్‌లను కేవలం పేరుకే పదవిలో ఉంచాలని చూస్తే మేము చూస్తూ ఊరుకోం.గ్రామ పంచాయతీ పాలన అనేది ఒక్కరి పెత్తనం కోసం కాదు ప్రజల కోసం. సర్పంచ్‌కు ఉన్న గౌరవం మాకు కూడా ఉంది. అదే విధంగా ఉపసర్పంచ్ పదవికి కూడా గౌరవం, బాధ్యత ఉన్నాయి.సర్పంచ్‌లకు అధికారం కావాలంటే మాకు కూడా బాధ్యతతో కూడిన అధికారాలు కావాలి. మమ్మల్ని బలహీనపరిచి గ్రామ పాలనను బలోపేతం చేయలేరు.గతంలో మా సహకారం అవసరమైనప్పుడు మమ్మల్ని వెంట పెట్టుకుని, ఇప్పుడు అధికారాలు అవసరం లేదని మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారు. ఉపసర్పంచ్‌ల హక్కులను కాలరాస్తే ప్రతి గ్రామంలో ఉపసర్పంచ్‌లంతా ఐక్యంగా నిలబడతాం. అవసరమైతే మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు మా పోరాటాన్ని తీసుకెళ్తాం. అధికారాలు తగ్గిస్తే మౌనంగా ఉండలేం హక్కులు హరించాలంటే పోరాటం చేస్తాం.మా పోరాటం ఎవరి మీద వ్యక్తిగత కక్ష కోసం కాదు.

ఉపసర్పంచ్ పదవికి ఉన్న గౌరవం, హక్కులు మరియు గ్రామ ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసమే. సర్పంచ్ ఒక్కరితో గ్రామ పాలన కాదు సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్,వార్డు సభ్యులు కలిసి పనిచేసినప్పుడే నిజమైన గ్రామ పాలన అని వెంచిర్యాల్ కు చెందిన గ్రామ ఉపసర్పంచ్ అన్నపూర్ణాదేవి తెలిపారు.

# డ్రైవర్ నిర్లక్ష్యం అతివేగం వల్ల రోడ్డు ప్రమాదం,మహిళ మృతి



**మెండోర,(ప్రజా జ్యోతి) ఆగస్టు 10** మెండోర మండల కేంద్రంలోని ముప్కాల్, మెండోర మార్గ మధ్యంలో ప్రయాణికులతో వస్తున్న ఆటో బోల్తా కొట్టి ప్రమాదం జరిగింది.ఆటోలో ఏడుగురు ప్రయాణికులు ఉండగా కోడిచెర్ల కు చెందిన వేల్పూర్ దేవాయి (55) అక్కడికక్కడే మరణించింది. మిగతా ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా వారిని ఆసుపత్రికి తరలించారు. ముప్కాల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సాయికుమార్ నిర్లక్ష్యం, అతి వేగమే ఈ ప్రమాదానికి కారణమని స్థానిక ఎస్సై సుహాసిని తెలిపారు.మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వేంపల్లి లో రైతులకు ఫార్మ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ యాప్ పై అవగాహన.



**ముప్కాల్,( ప్రజాజోతి ), ఆగస్టు 10** వేంపల్లి గ్రామంలో రైతులకు ఫార్మ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ యాప్ పై ఏఈఓ స్నేహ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం తీసుకొచ్చిన ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకుని ఓపెన్ చేసిన తర్వాత లిడీఏపీ, యూరియా, పొటాష్ వంటి ఎరువులు ఎక్కడెక్కడ అందుబాటులో ఉన్నాయో సులభంగా తెలుసుకోవచ్చని వివరించారు.ఎరువుల కొరత, బ్లాక్ మార్కెట్ సమస్యలకు ఈ యాప్ పరిష్కారం చూపుతుందని, రైతులందరూ ఈ యాప్ ను తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ యాదవ్, గ్రామ ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులు యాప్ డౌన్లోడ్ చేసుకునే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

# జైలు భరో కార్యక్రమంలో ర్యాలీ రాస్తారోకో నిర్వహించిన అంగన్వాడి టీచర్లు



**బాల్కొండ ఆర్సి ప్రజా జ్యోతి ఆగస్టు 10** నిజమాబాద్ జిల్లా భీంగల్ మండలంలో ఈరోజు దేశవ్యాప్తంగా కార్మిక కర్షక సంఘాల పిలుపులో భాగంగా భీంగల్ పట్టణంలో అంగన్వాడీ ఉద్యోగులు సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి రాస్తారోకోనో చేయటం జరిగింది ఈ సందర్భంగా అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కైరిదేవ గంగు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగుల గోవర్ధన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు మోహన్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోర్లను తీసుకురావడం సరైంది కాదని ,వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని కార్మికులకు కనీస వేతనాలు అమలు జరపాలని ,ఉద్యోగ భద్రత కల్పించాలని ,ఉపాధి హామీ చట్టాన్ని పాత విధానం కొనసాగించాలని, పెరుగుతున్న ధరలను అదుపు చేయాలని, విత్తన చట్టాన్ని సవరించాలని, పంటలకు మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు జ్యోతి, ప్రమీల, లక్ష్మి, యమునా, భాగ్య తదితరులతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# భవానిపేట్‌లో మంద గోవిందా రెడ్డి కుటుంబానికి గంప గోవర్ధన్ పరామర్శ

**మాతృమూర్తి మృతికి సంతాపం తెలిపిన మాజీ ప్రభుత్వ విప్**
**కుటుంబ సభ్యులను ఓదార్చి, మనోధైర్యం కల్పించిన గంప గోవర్ధన్**



**కామారెడ్డి టౌన్ ఆగస్టు 10 (ప్రజాజ్యోతి)** భవానిపేట్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మంద గోవిందా రెడ్డి మాతృమూర్తి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సోమవారం వారి స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాతృమూర్తి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన ఆయన, కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. కుటుంబంలో పెద్ద దిక్కుగా ఉన్న మాతృమూర్తిని కోల్పోవడం బాధాకరమని, ఆమె మృతి కుటుంబానికి తీరని లోటని అన్నారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ఈ విషాద సమయంలో మనోధైర్యాన్ని కోల్పోకూడదని సూచించారు. గంప గోవర్ధన్ వెంట పల్వాంచ మండల అధ్యక్షులు బొంబోతుల రాజా గౌడ్, కుంభల రవి యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ రావు, శ్రీకాంత్ రెడ్డి, రాఘవేందర్ రావు, సర్పంచులు శ్రీనివాస్ గౌడ్, గ్యార సాయిలు, మండల నాయకులు పైడకుల రాములు, గంగా రెడ్డి, రమేష్ గౌడ్, రాజానర్సు, బాల గౌడ్, నర్సింలు, యూత్ అధ్యక్షులు దేవరాజ్, ప్రశాంత్ రెడ్డి, అలాగే ఆకు రాజాం, నరేష్, రంజిత్, సాయి గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ

**-- విజయవంతంగా పూర్తి**
**-- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**కామారెడ్డి ప్రతిరెడ్డి ఆగస్టు 10 (ప్రజాజ్యోతి)** ఓటర్ల వివరాల ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యత -- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) కామారెడ్డి జిల్లాలో విజయవంతంగా పూర్తయిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. జిల్లాలోని జుక్కల్, యెల్లారెడ్డి, కామారెడ్డి మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 796 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన 6,96,006 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల ముద్రణ, పంపిణీ 100 శాతం పూర్తయిందని కలెక్టర్ వెల్లడించారు. ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సమగ్రంగా నమోదు చేయడం ద్వారా ఓటర్ల జాబితాను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

**నియోజకవర్గాల వారీగా వివరాలు....!**

జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గం: 2,06,343 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయింది. ఇప్పటివరకు 90.27 శాతం వివరాల డిజిటైజేషన్ పూర్తయింది.

**యెల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం ....!**

2,28,503 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయింది. 90.17 శాతం వివరాల డిజిటైజేషన్ పూర్తయింది.

కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం...!

2,61,160 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయింది. 83.96 శాతం వివరాల డిజిటైజేషన్ పూర్తయింది.

**జిల్లా స్థాయి గణాంకాలు..!**

జిల్లా వ్యాప్తంగా మొత్తం 6,96,006 మంది ఓటర్లు ఉండగా, అందరికీ ఎన్నికల ఫారాల ముద్రణ, పంపిణీ 100 శాతం పూర్తయింది. ఇప్పటివరకు 6,11,568 ఎన్నికల ఫారాలు, అంటే 87.87 శాతం డిజిటైజేషన్ పూర్తయినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 796 మంది బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి సంబంధించిన శిక్షణను పూర్తిగా పొందారు. 84,438 ధృవీకరణ కాని ఎన్నికల ఫారాలు నమోదు చేసినట్లు తెలిపారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా మరణించిన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, ఇప్పటికే మరోచోట నమోదు అయిన వారు, గైర్హాజరైన ఓటర్లు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత వర్గీకరణలను స్పష్టంగా నమోదు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

**ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించాలి..!**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం ప్రతి ఓటరు మరోసారి తమ పేరు, చిరునామా, వయస్సు, ఇతర ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు.తమ వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నా, పేరు లేకపోయినా లేదా ఇతర అభ్యంతరాలు ఉన్నా, నిబంధనల ప్రకారం సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి సవరణలు, అభ్యంతరాలు నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అర్హులైన ప్రతి ఓటరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను నిబంధనల ప్రకారం సరిచేసే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

**ఓటర్లు తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలి.....!**

ప్రతి ఓటరు తమ ఓటరు జాబితాలోని పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఓటర్ల నుంచి బూత్ స్థాయి అధికారులు సేకరించిన వివరాలను విధివిధానాల ప్రకారం డిజిటైజ్ చేస్తున్నామని తెలిపారు.ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో కృషి చేసిన ఎన్నికల సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం, పారదర్శకతను నిర్ధారించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

# జైలు బరో కార్యక్రమం బోధన్అంబేద్కర్ చౌరస్తాలో..





**ప్రజా జ్యోతి బోధన్ఆగస్టు 10..** బోధన్ నియోజకవర్గం బోధన్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా నుండి వామపక్ష పార్టీల ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చలో జైలు మరో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు. టి యు సి ఐ. ఐ ఎఫ్ టు యు. ఎన్ పి ఆర్ డి. తెలంగాణ రైతు సంఘం. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం. బిఎల్ఎఫ్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జమ్మిశెట్టి శంకర్ గౌడ్.. జిల్లా నాయకులు. బందారి మల్లేష్.. ఐ ఎఫ్ టీ యు జిల్లా నాయకులు పుట్ట వరదయ్య.. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి. ఏషాల గంగాధర్. బిఎల్ఎఫ్ యూనియన్ నాయకులు దాల్ మల్కా పోశెట్టి. కార్మికులను. రైతులను వ్యవసాయ కార్మికులను. వికలాంగులు వృద్ధులు వితంతులను ఉద్దేశించి మాట్లాడినారు.. కేంద్ర ప్రభుత్వము దేశవ్యాప్తంగా కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చింది. రైతులకు వ్యతిరేకంగా అమరేఖతో వ్యవహానిజ ఒప్పందం చేసుకున్న రూ 2025 విద్యుత్ సవరణ చట్టం. ఇలాంటి అనేక ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ భారతదేశంలోని 90 శాతం పేదలు నివసిస్తున్న అటువంటి ప్రజలు నష్టం చేసే విధానాలు కొనసాగిస్తున్నారు దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా వామపక్ష ప్రజాసంఘాలు పిలుపు ఇవ్వడం జరిగింది భాగంగా బోధన్ నిజకవర్గంలో ఉన్నటువంటి అన్ని మండలాల నుంచి బోధన్ పట్టణం అన్ని గ్రామాల నుండి రైతులు వ్యవసాయ కూలీలు కార్మికులు వృద్ధులు వితంతులు వికలాంగులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయటం జరిగింది ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తను అనుసరిస్తున్న విధానాలను వెనుకకు తీసుకోవాలా లేనిపక్షంలో కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వానికి దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో.. తెలంగాణ రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు మటపతి గంగాధరప్ప సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జంగం గంగాధర్. సిఐటియు జిల్లా నాయకులు గోవింద్ సాగర్. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్ పి ఆర్ డి. నిజాంబాద్ జిల్లా అధ్యక్షులు గైని రాములు. నాగమణి. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు రాజేశ్వరి పద్మ. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు. అని ఫాతిమా. జమ్మిశెట్టి లక్ష్మి. కళావతి. ఏషాల సావిత్రి . బెల్లిగా గంగమణి. పత్రి ఎల్లయ్య. పేట భాషా సాయిలు. బందారి నాగమణి మహిళా సంఘం నాయకురాలు. ప్రభాస్. గౌతమ్. సాయిలు. ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు. రమ సునీత. తదితరులు పాల్గొన్నారు. ఇట్లు. ఏషాల గంగాధర్. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజాంబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి

# జైల్‌భరోతో దద్దరిల్లిన కామారెడ్డి

-**మొదటిపేజీ తరువాయి**

రైతాంగం, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడి, సాగునీరు, విత్తనాలు, ఎరువులు వంటి అంశాల్లో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ కార్మికులకు నిరంతర ఉపాధి, సరైన వేతనాలు, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వ పరంగా మరింత భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**కార్పొరేట్ అనుకూల విధానాలపై మండిపాటు**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రజా ఆస్తులు, సహజ వనరులను ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధంగా ఉన్నాయని నాయకులు విమర్శించారు. దేశ సంపద, భూములు, ఖనిజ వనరులు ప్రజల ఆస్తులని, వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధానాలను వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు.

ప్రజల సమస్యలపై ప్రశ్నించే హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, ఆ హక్కును పోలీసులు, ప్రభుత్వం అడ్డుకోవడం తగదన్నారు.

**పోలీసుల చర్యలపై తీవ్ర నిరసన**

జైల్‌భరో కార్యక్రమానికి ముందే పోలీసులు పలువురు నాయకులను అదుపులోకి తీసుకోవడంపై నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు, అరుణ్‌తో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.

అరెస్టులతో ఆందోళనను అడ్డుకోవాలని ప్రయత్నించినప్పటికీ నాయకులు, కార్యకర్తలు తమ డిమాండ్లను గట్టిగా వినిపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

**కార్మికులు, ప్రజా సంఘాల ఐక్య పోరాటం**

కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా,




మున్సిపల్, గ్రామపంచాయతీ ఉద్యోగులు, ఇతర ప్రజా సంఘాల నాయకులు జైల్‌భరో కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. వివిధ సంఘాలు ఐక్యంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశాయి.

కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలను అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

**అరెస్టులతో ఉద్యమం ఆగదు**

ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో చైతన్యం పెరుగుతోందని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఉద్యమాలను అరెస్టులతో అడ్డుకోవడం సాధ్యం కాదని నాయకులు అన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజా సంఘాల సమస్యలపై మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ప్రజా ఉద్యమాలను గౌరవించి ప్రభుత్వం వెంటనే నాయకులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేబర్ కోడుల రద్దు, పాత కార్మిక చట్టాల అమలు, వ్యవసాయ రంగ పరిరక్షణ, రైతులు--వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**పలువురు నాయకుల పాల్గొనడం**

ఈ జైల్‌భరో కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త నరసింహులు, జిల్లా కార్యదర్శి వెంకటి, సీఐటీయూ నాయకులు రాజనర్సింహ, ముదాం అరుణ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్ల మోహన్, మున్సిపల్ యూనియన్ నాయకులు మహబూబ్, నర్సింగరావు, సంతోష్, దీవెన, శివ, రాజవ్వ, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబాయమ్మ, ఇందిరా, లక్ష్మి, ఆశా యూనియన్ నాయకులు రాజశ్రీ, మమత, గ్రామపంచాయతీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బాల్నర్సు, మాచారెడ్డి బాలనర్సు, స్వామి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన డిమాండ్లు

**లేబర్ కోడులను తక్షణమే రద్దు చేయాలి**

పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించి పకడ్బందీగా అమలు చేయాలి

కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు కల్పించాలి

వ్యవసాయ రంగాన్ని పరిరక్షించి రైతుల సమస్యలను పరిష్కరించాలి

వ్యవసాయ కార్మికులకు ఉపాధి, మెరుగైన వేతనాలు కల్పించాలి

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ నుంచి కాపాడాలి

ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలపై అక్రమ అరెస్టులు నిలిపివేయాలి

ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలి

# దేశభక్తి నినాదంతో బీజేపీ పిలుపు
# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

**గాంధారి, ఆగస్టు 10 (ప్రజాజ్యోతి )** దేశభక్తిని చాటేలా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ గాంధారి మండల అధ్యక్షుడు ఈకే మధుసూదన్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన అధ్యక్షతన గాంధారి మండల బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలన, దేశాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ప్రధాని పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుతూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈకే ప్రభాకర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సంజు, మోర్చా మండల మాజీ అధ్యక్షుడు మాణిక్‌రావు, సొసైటీ డైరెక్టర్ శివాజీరావు, దుర్గం బూత్ అధ్యక్షుడు సుభాష్, బౌన్సర్ రాజు, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి

-మొదటిపేజీ తరువాయి

తెలిపారు. ఓటర్ల నుంచి సేకరించిన వివరాలను విధివిధానాల ప్రకారం పరిశీలించి డిజిటైజ్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

**జుక్కల్‌లో 90.27 శాతం డిజిటైజేషన్**

జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 2,06,343 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయింది. ఇప్పటివరకు ఓటర్ల వివరాల్లో 90.27 శాతం డిజిటైజేషన్ పూర్తయినట్లు కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని సంబంధిత సిబ్బంది పరిశీలించి, రికార్డుల్లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు.

**యెల్లారెడ్డిలో 90.17 శాతం పూర్తి**

యెల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో 2,28,503 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయింది. ఇప్పటివరకు 90.17 శాతం వివరాల డిజిటైజేషన్ పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన వివరాలను కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు.

**కామారెడ్డిలో 83.96 శాతం డిజిటైజేషన్**

కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 2,61,160 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయింది. ఇప్పటివరకు 83.96 శాతం ఓటర్ల వివరాల డిజిటైజేషన్ పూర్తయినట్లు కలెక్టర్ తెలిపారు. ఓటర్ల నుంచి సేకరించిన సమాచారాన్ని సమగ్రంగా పరిశీలించి, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**జిల్లాలో 6.11 లక్షల ఫారాల డిజిటైజేషన్**

జిల్లా వ్యాప్తంగా మొత్తం 6,96,006 మంది ఓటర్లు ఉండగా, వారందరికీ ఎన్నికల ఫారాల ముద్రణ, పంపిణీ ప్రక్రియ 100 శాతం పూర్తయింది. ఇప్పటివరకు 6,11,568 ఎన్నికల ఫారాలు అంటే 87.87 శాతం డిజిటైజేషన్ పూర్తయినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. మొత్తం 796 మంది బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి సంబంధించిన శిక్షణను పూర్తిగా పొందారని చెప్పారు. అలాగే 84,438 ధృవీకరణ కాని ఎన్నికల ఫారాలు నమోదు చేసినట్లు తెలిపారు.

**క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన**

ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో అధికారులు, బూత్ స్థాయి అధికారులు పరిశీలించారు. ఓటర్ల వివరాల్లో మార్పులు, చిరునామాలు, ఇతర వివరాలను పరిశీలించడంతో పాటు మరణించిన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు, ఇప్పటికే మరోచోట ఓటరుగా నమోదైన వారు, గైర్హాజరైన ఓటర్లు తదితర అంశాలను గుర్తించి సంబంధిత వర్గీకరణలను నిబంధనల ప్రకారం నమోదు చేసినట్లు కలెక్టర్ వివరించారు.

ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలో అనవసరమైన తప్పిదాలను తొలగించడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా తయారీలో ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు.

**ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించాలి**

ఎస్ఐఆర్ ప్రక్రియలో తదుపరి దశలో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ముసాయిదా జాబితా ప్రచురించిన అనంతరం ప్రతి ఓటరూ తమ పేరు, చిరునామా, వయస్సు, ఇతర ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు.

తమ వివరాల్లో ఏదైనా తప్పు ఉన్నా, పేరు జాబితాలో లేకపోయినా లేదా ఇతర అభ్యంతరాలు ఉన్నా నిబంధనల ప్రకారం సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి సవరణలు, అభ్యంతరాలు నమోదు చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఓటరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను నిబంధనల ప్రకారం సరిచేసే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

**ప్రతి ఓటరూ బాధ్యతగా వ్యవహరించాలి**

ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడు తన ఓటరు వివరాలను పరిశీలించుకోవడం బాధ్యతగా భావించాలని కలెక్టర్ సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్ల నుంచి సేకరించిన వివరాలను విధివిధానాల ప్రకారం డిజిటైజ్ చేస్తున్నారని, ఈ ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేరు, చిరునామా లేదా ఇతర వివరాల్లో ఏవైనా మార్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి సకాలంలో సరిచేయించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే తమ వివరాలను పరిశీలించుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు.

**ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ అభినందనలు**

జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో కృషి చేసిన ఎన్నికల సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందించారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో భారీ స్థాయిలో చేపట్టిన ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారని ప్రశంసించారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం, పారదర్శకతను నిర్ధారించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు అందేలా, ఓటర్ల జాబితా విశ్వసనీయంగా ఉండేలా ఎన్నికల యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

# కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి



**సదాశివనగర్, 10 (ప్రజాజ్యోతి)** సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిర్మాన్‌పల్లి గ్రామ శివారులో గల ఇటుక బట్టీ ప్రాంగణంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సదాశివనగర్ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో కోడిపందేలు నిర్వహిస్తున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పుష్పరాజ్. తెలిపారు. వారి వద్ద నుంచి 09 ద్విచక్ర వాహనాలు, 03 కార్లు, 11 మొబైల్ ఫోన్లు, రూ.45,050 నగదు, 65 కోడిపందేల కత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు దాడి చేస్తున్న సమయంలో కొంతమంది అక్కడి నుండి పారిపోయారు వారిని గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై పుష్పరాజ్. తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. చట్టవిరుద్ధంగా కోడిపందేలు, జూదం వంటి కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎక్కడైనా ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజలు అందించే సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# సైకిల్‌పై వెళ్తూ అకస్మాత్తుగా వ్యక్తి మృతి

**గాంధారి, ఆగస్టు 10 (ప్రజాజ్యోతి )** సైకిల్‌పై ఇంటికి వెళ్తున్న ఓ వ్యక్తి మార్గమధ్యలో ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందిన ఘటన గాంధారి మండలంలో చోటుచేసుకుంది. అనారోగ్య సమస్యల కారణంగానే ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు .పోతంగల్ కలాన్ గ్రామానికి చెందిన నస్రుద్దీన్ (55) ఆదివారం మధ్యాహ్నం సైకిల్‌పై గాంధారి మార్కెట్‌కు కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. పనులు ముగించుకుని రాత్రి సుమారు 8 గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు.రాంపూర్ గడ్డ సమీపంలోని రైస్‌మిల్లు ఎదుట రోడ్డు పక్కన సైకిల్‌పై వెళ్తుండగా ఒక్కసారిగా కిందపడిపోయాడు. అక్కడికక్కడే మృతి చెందినట్లు ఏఎస్సై ప్రకాష్ తెలిపారు.నస్రుద్దీన్ కొంతకాలంగా ఆస్తమా, ఫిట్స్ వ్యాధులతో బాధపడుతున్నట్లు ఏ ఎస్. ఐ ప్రకాష్ తెలిపారు.మృతుని భార్య హలీమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం రోజు కేసు నమోదు చేయడం జరిగిందని ఏ ఎస్. ఐ ప్రకాష్ తెలిపారు.

# మార గుడాడి రెడ్డి సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక



**సదాశివనగర్, ఆగస్టు 10 (సాక్ష్యం)** సదాశివనగర్ మండలం తిర్మాన్ పల్లి గ్రామంలో గ్రామ గుడాడి రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మారచిన్న గంగారెడ్డి. అధ్యక్షులుగా మార బాల్ రెడ్డి. కార్యదర్శులుగా మారా శ్రీనివాస్ రెడ్డి. మార అశోక్ రెడ్డి. కోశాధికారిగా మార తిరుపతిరెడ్డి. డైరెక్టర్లుగా మారా రాజిరెడ్డి. మాల నారాయణరెడ్డి. మారా నర్సిరెడ్డి. మేనేజింగ్ డైరెక్టర్ గా మార బాల్రెడ్డి. వీరిని సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు సంఘ కట్టుబాట్లకు ఉంటూ సంఘానికి సేవలందిస్తామని అన్నారు.

# తెలంగాణ కేబినెట్ విస్తరణకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్..

**హైదరాబాద్ :** తెలంగాణ కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. విస్తరణకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఈ దఫాలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులను భర్తీ చేయడంతోపాటు ప్రస్తుత మంత్రుల శాఖల మార్పునకు అకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే, కేబినెట్ నుంచి ఒకరికి ఉద్వాసన పలుకుతారని గతంలో ప్రచారం జరిగినప్పటికీ.. ప్రస్తుతం ఆమేరకు అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం అందరిలో ఉత్కంఠ నెలకొంది.పక్క రాష్ట్రమైన కర్ణాటలో మంత్రివర్గ విస్తరణ పూర్తయిన నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం తన ఫోకస్‌ను తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై పెట్టినట్లు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయింది. పలువురు సీనియర్, జూనియర్ ఎమ్మెల్యే మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకు మంత్రి పదవి ఇవ్వాలంటూ ఇప్పటికే పలు దఫాలుగా కేంద్ర పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పలు సందర్భాల్లో బహిరంగంగానూ మంత్రి పదవి దక్కలేదని తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇలా పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యే మంత్రి పదవి కోసం తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, ఈసారి కేబినెట్ విస్తరణలో ఎవరికి అదృష్టం వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.కేబినెట్ విస్తరణకు అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఈ దఫాలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులను భర్తీ చేయడంతో పాటు ప్రస్తుత మంత్రుల శాఖల మార్పునకు అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రెండు బెర్త్ లలో ఎస్టీ, రెడ్డి సామాజిక వర్గాల వారికి చాన్స్ దక్కే అవకాశం ఉంది. ఎస్టీ సామాజిక వర్గం నుంచి రేసులో రామచంద్రు నాయక్, బాలు నాయక్ లు ఉన్నట్లు సమాచారం. వీరిలో ఒకరికి మంత్రి పదవి దక్కేఅ వకాశాలు ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు.. రెడ్డి సామాజిక వర్గం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, సుందర్శన్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి.తెలంగాణ కేబినెట్లో ప్రస్తుతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఎలాంటి ప్రాతినిధ్యం లేదు. స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ కొనసాగుతున్నారు. అయితే, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి కేటాయించాలని స్థానిక నేతలు కోరుతున్నారు. అధిష్టానం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రాధాన్యం ఇస్తే.. ఆ జిల్లాకు చెందిన మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డిలలో ఎవరికో ఒకరికి మంత్రి పదవి దక్కే అవకాశం ఉందన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది.

# కాంగ్రెస్‌లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు



**కామారెడ్డి, టౌన్ ఆగస్టు 10 (ప్రజాజ్యోతి)** కాంగ్రెస్ పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయని, అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని, కొంత ఆలస్యం కావచ్చేమో కానీ పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న ఏ కార్యకర్తకు అన్యాయం జరగదని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టకాలంలో జెండా మోసిన ప్రతి కార్యకర్తను పార్టీ ఎప్పటికీ విస్మరించదని, వారి కష్టాన్ని గుర్తించి సముచిత గౌరవం కల్పిస్తామని అన్నారు.

కామారెడ్డి పట్టణంలోని గోపాలస్వామి ఆలయం సమీపంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో కామారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి ఏ సి ఎస్) నూతన చైర్మన్‌గా ఎన్నికైన గూడెం శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నూతన చైర్మన్‌తో పాటు నూతనంగా ఎన్నికైన 13 మంది డైరెక్టర్లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, సహకార సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాణ స్వీకారం అనంతరం కామారెడ్డి పట్టణంలోని క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో నూతన చైర్మన్, డైరెక్టర్ల అభినందన సభ, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ హాజరై నూతన చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డితో పాటు డైరెక్టర్లను అభినందించారు. నూతన పాలకవర్గాన్ని శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

**13 మంది డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం**

కామారెడ్డి పి ఏ సి ఎస్ నూతన పాలకవర్గంలో చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డితో పాటు 13 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన డైరెక్టర్లుగా కనుకంటి చిన్న సాయిలు, చింతల లక్ష్మీ నర్సింలు, గౌరీ నరసింహ రెడ్డి, జెగ్గా లింగం, తెడ్డు ప్రమీల, నీలం లక్ష్మి, బొంబోతుల కుమార్ గౌడ్, అనుమండ్ల రాజు, కృష్ణాజీ, గారి ఆనంద్ రావు, పెద్ద పోతనగారి రాజేష్, మామిండ్ల హనుమాన్లు, లంబాడి రమేష్ ప్రమాణ స్వీకారం చేశారు.

నూతన చైర్మన్, డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సహకార సంఘం పరిధిలోని రైతుల్లో ఉత్సాహం నెలకొంది. రైతులకు అవసరమైన సహకారాన్ని అందించడంతో పాటు, వారి సమస్యలను పరిష్కరించేందుకు నూతన పాలకవర్గం ప్రత్యేక చొరవ తీసుకోవాలని పలువురు నాయకులు ఆకాంక్షించారు.

**కార్యకర్తల కష్టాన్ని కాంగ్రెస్ ఎప్పటికీ మర్చిపోదు**

అభినందన సభలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు రానున్న రోజుల్లో మరిన్ని అవకాశాలు లభిస్తాయని అన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్న వారికి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని, కొంత ఆలస్యం కావచ్చు కానీ ఎవరికి అన్యాయం జరగదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కూడా జెండాను మోస్తూ ప్రజల్లో కాంగ్రెస్ సిద్ధాంతాలను తీసుకెళ్లిన కార్యకర్తల కృషి మరువలేనిదని పేర్కొన్నారు.

"పార్టీని నమ్ముకుని పనిచేసిన కార్యకర్తలను కాంగ్రెస్ ఎప్పటికీ విస్మరించదు" అని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, నాయకత్వానికి కార్యకర్తలే బలం అని అన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన ప్రతి ఒక్కరినీ గుర్తించి తగిన గౌరవం కల్పించడమే కాంగ్రెస్ విధానమని తెలిపారు.

**రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని షబ్బీర్ అలీ అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు.



"కాంగ్రెస్ అంటేనే రైతులు.. రైతులు అంటేనే కాంగ్రెస్" అని ఆయన పేర్కొన్నారు. రైతుల కష్టాలు, వ్యవసాయ రంగ సమస్యలు కాంగ్రెస్ పార్టీకి బాగా తెలుసని అన్నారు. రైతులకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలిచి వారి ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేస్తోందని తెలిపారు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. వ్యవసాయ రంగం బలోపేతం కావడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని తెలిపారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వ్యవసాయానికి అవసరమైన సహకారాన్ని అందించడంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషించాలని అన్నారు.

**రైతుల సమస్యల పరిష్కారానికి పి ఏ సి ఎస్ కేంద్రంగా ఉండాలి**

పి ఏ సి ఎస్ నూతన చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, నూతన డైరెక్టర్లు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని షబ్బీర్ అలీ సూచించారు. సహకార సంఘాలు కేవలం పదవులకే పరిమితం కాకుండా రైతుల సంక్షేమానికి నిరంతరం పనిచేసే వేదికలుగా మారాలని ఆకాంక్షించారు.

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నూతన పాలకవర్గం ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రైతులకు అందాల్సిన సహకారం, సేవలు పారదర్శకంగా అందేలా చూడాలని అన్నారు. సహకార సంఘంపై రైతుల్లో నమ్మకాన్ని మరింత పెంచే విధంగా చైర్మన్, డైరెక్టర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**గూడెం శ్రీనివాస్ రెడ్డికి అభినందనలు**

కామారెడ్డి పి ఏ సి ఎస్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గూడెం శ్రీనివాస్ రెడ్డికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించాలని ఆకాంక్షించారు.

సహకార సంఘం అభివృద్ధిలో డైరెక్టర్ల సహకారం ఎంతో అవసరమని, చైర్మన్‌తో పాటు 13 మంది డైరెక్టర్లు సమన్వయంతో పనిచేసి పి ఏ ఏ సి ఎస్ ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

ఘనంగా సన్మానం

నూతన చైర్మన్, డైరెక్టర్ల అభినందన సభలో నాయకులు, ప్రజాప్రతినిధులు నూతన పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, 13 మంది డైరెక్టర్లను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా నూతన పాలకవర్గం సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని,ౕాూజూ ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

**భారీగా హాజరైన కాంగ్రెస్ శ్రేణులు**

ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షులు కైలా శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లోకోటి సుదర్శన్ రావు పీసీసీ జనరల్ సెక్రటరీ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమా శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ఐరేని సందీప్, పండ్లరాజు, గుడుగుల శ్రీనివాస్, అజ్మత్, భరత్, ఎడ్ల రాజిరెడ్డి, రాజా గౌడ్, నవసిలాల్, రమేష్ గౌడ్, అంకం కృష్ణారావు, ఆశాబోయిన శ్రీనివాస్, గోనె శ్రీనివాస్, భూమని బాలరాజ్, రెడ్డి నాయక్, ఇంద్రసేనారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి, మాజీ ఎంపీపీ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు,ౕాూజూ నూతన చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, నూతన డైరెక్టర్లు, సహకార సంఘం ప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నూతన చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధి, పార్టీ కార్యకర్తలకు గుర్తింపు వంటి అంశాలపై నాయకులు చేసిన వ్యాఖ్యలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## సంపాదకీయం

# ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లులో బిగ్ ట్విస్ట్

భారతదేశంలో చట్టాలు రూపొందించడం, వాటిపై చర్చించడం పార్లమెంటు, రాజకీయ పార్టీల నేతల పరిధిలోనిదే. అభ్యంతరాలు ఉంటే అవి సభల్లోనే వ్యక్తం కావాలి. దీనికి విరుద్ధంగా విదేశీ నేతలు స్పందించడం అంతర్గత వ్యవహారాల్లో జోక్యంగా పరిగణించబడుతుంది. ఇటీవల ఎఫ్‌సీఆర్‌ఏ సంబంధిత బిల్లు విషయంలో ఇదే సూత్రాన్ని భారత్ స్పష్టం చేసింది. ఈ బిల్లు విదేశీ నిధుల రాకపోకలపై నియంత్రణను మరింత కఠినం చేసే దిశగా ఉంది. సంస్థలు నిధుల మూలాలు, ఖర్చుల వివరాలు స్పష్టంగా నివేదించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఆస్తులు జప్తు చేసే అధికారం కేంద్రానికి ఉంటుంది. దీని ద్వారా అంతర్గత భద్రతకు ముప్పు కలిగించే శక్తులపై నియంత్రణ సాధ్యమవుతుందని ప్రభుత్వ వైపు నుంచి వాదన ఉంది. రాజకీయ చర్చలు ఈ అంశం చుట్టూనే తిరగనున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ఈ బిల్లు ఆమోదంపై దృఢంగా ఉన్నారని సూచనలు వస్తున్నాయిఈ ప్రక్రియపై అమెరికా సెనేటర్ రైలీ మూర్ వ్యతిరేకత వ్యక్తం చేశారు. భారత్‌లో క్రైస్తవులు సెయింట్ థామస్ కాలం నుంచి ఉన్నారని, వేల సంవత్సరాల చరిత్ర ఉందని చెబుతూ, ఎఫ్‌సీఆర్‌ఏ ద్వారా వారిని నియంత్రించాలని ప్రయత్నం జరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నంగా కనిపించాయి. అయితే అమెరికాలోనే అమలులో ఉన్న ఇలాంటి నియంత్రణల గురించి ఆయన ప్రస్తావించలేదు. భారత్ నుంచి అమెరికాలోని ఇస్కాన్ వంటి సంస్థలకు నిధులు వెళ్తే అవి అమెరికా నిబంధనలకు లోబడి లెక్కలు చూపాల్సి ఉంటుంది. ఇదే తరహా జవాబుదారీతనం భారత్‌లోనూ అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ బిల్లు వస్తోంది.విదేశీ వ్యాఖ్యలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పందించారు. ఇది పూర్తిగా భారత అంతర్గత వ్యవహారమని, బయటివారు స్పందించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇలాంటి స్పష్టత అమెరికాకు అసౌకర్యం కలిగించవచ్చు. యూరప్ నేతలు కూడా ఇలాంటి సందర్భాల్లో సాధారణంగా జాగ్రత్తగా ఉంటారు. అయినా భారత్ తన సార్వభౌమత్వాన్ని నొక్కి చెప్పింది. రైలీ మూర్ ట్రంప్‌కు సన్నిహితుడని, ఆయన ద్వారా సందేశం వస్తున్నట్లు కొందరు అంచనా వేస్తున్నా, అధికారికంగా ఇది ఒక సెనేటర్ వ్యక్తిగత అభిప్రాయంగానే చూడాలి.ప్రతి దేశం తన భద్రత, నిధుల పారదర్శకత కోసం చట్టాలు తీసుకురావడం సహజం. వివాదాస్పద విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు?2026పై కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. ఈ బిల్లును గత కాలానికి (రెట్రోస్పెక్టివ్‌గా) వర్తింపజేయబోమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లు మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమా వెల్లడించారు. మిజోరం చర్చి నాయకుల ప్రతినిధి బృందంతో కలిసి అమిత్ షాను కలిసిన అనంతరం ఆయన ఈ విషయాన్ని మీడియాకు తెలిపారు. ఈ బిల్లును ఆగస్టు 12న పార్లమెంట్‌లో చర్చించి ఆమోదానికి తీసుకురానున్నట్లు హోంమంత్రి వెల్లడించినట్లు చెప్పారు.ప్రతిపాదిత ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు విదేశీ నిధులు స్వీకరించే స్వచ్ఛంద సంస్థలపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రద్దు అయిన, గడువు ముగిసిన లేదా స్వచ్ఛందంగా వదులుకున్న సంస్థలకు చెందిన విదేశీ నిధులు, వాటితో కొనుగోలు చేసిన ఆస్తులను ప్రభుత్వం నియమించే ప్రత్యేక అధికార సంస్థ ఆధీనంలోకి తీసుకునే విధంగా కొత్త నిబంధనలు తీసుకురావాలని బిల్లు ప్రతిపాదిస్తోంది.అయితే ఈ చట్టాన్ని గతానికి వర్తింపజేస్తే నిజాయితీగా పనిచేస్తున్న సంస్థలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమా, మిజోరం కోహ్రాన్ హ్రూయితు కమిటీ, మిజోరం చర్చిల మండలి ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన పరిపాలనా లేదా సాంకేతిక లోపాల కారణంగా స్వచ్ఛంద సంస్థలు శిక్షార్హులుగా మారే అవకాశం ఉందని పేర్కొంటూ, ఈ చట్టాన్ని భావి కాలానికి మాత్రమే వర్తింపజేయాలని కేంద్రాన్ని కోరారు. దీనిపై స్పందించిన అమిత్ షా, బిల్లు గతానికి వర్తించదని హామీ ఇచ్చినట్లు లాల్దుహోమా తెలిపారు.ఇదే సమయంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కొనసాగుతున్న ప్రతిష్టంభనను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేసింది. కీలకమైన మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లుతో పాటు ఇతర చట్టాలపై చర్చ జరిగేలా ప్రతిపక్షాలతో సంప్రదింపులు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో ఫోన్‌లో మాట్లాడి సహకారం కోరారు. గత పది రోజుల్లో పలుమార్లు ఇరు నేతల మధ్య చర్చలు జరిగినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.కాంగ్రెస్ మాత్రం కీలక బిల్లులపై ముందుగా అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది. అయితే దీనిపై కేంద్రం ఇప్పటివరకు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. మరోవైపు 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసే దిశగా రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రభుత్వం ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నాలు చేస్తోంది. అలాగే 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాలను 543 నుంచి 816కు పెంచే డీలిమిటేషన్ ప్రతిపాదనపైనా రాజకీయ పార్టీలతో చర్చలు కొనసాగుతున్నాయి. ఈ కీలక బిల్లులపై ఆగస్టు 12న జరిగే పార్లమెంట్ చర్చ దేశ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అమెరికా తన భూభాగంలో విదేశీ నిధులపై నియంత్రణలు పెట్టుకుంటే, భారత్‌లోనూ అదే హక్కు ఉంది. ఒకవైపు స్వేచ్ఛ, మత స్వాతంత్ర్యం గురించి మాట్లాడుతూ, మరోవైపు మరొక దేశం యొక్క నియంత్రణ చర్యలను లక్ష్యంగా చేసుకోవడం ద్వంద్వ ప్రమాణాలను సూచిస్తుంది. ఎఫ్‌సీఆర్‌ఏ కేవలం ఒక మతాన్ని లక్ష్యం చేసుకోవడం కాదు.. అన్ని సంస్థలకు వర్తించే సాధారణ నిబంధనలు. అంతర్గత శత్రువులు లేదా అపారదర్శక నిధుల మార్గాలను అడ్డుకోవడమే దీని ముఖ్య ఉద్దేశం.మొత్తంగా చూస్తే, ఈ వివాదం భారత్ తన స్వాతంత్ర్యాన్ని, చట్టపరమైన సార్వభౌమత్వాన్ని ఎలా కాపాడుకుంటుందో చూపిస్తోంది. విదేశీ అభిప్రాయాలు ఉండవచ్చు, కానీ నిర్ణయాలు భారత ప్రజలు, వారి ప్రతినిధులు తీసుకోవాలి. ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లు ఆమోదం పొందితే నిధుల పారదర్శకత పెరుగుతుంది.

# విజయ్ వర్సెస్ స్టాలిన్





**చెన్నై :** విజయ్ పిలిచారు.. స్టాలిన్ రాలేదు. డీఎంకే ఎంపీలు రాలేదు. అన్నాడీఎంకే కూడా దూరంగానే నిలిచింది. మరోవైపు కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్, ఎండీఎంకేకు చెందిన ఎంపీలు మాత్రం విజయ్‌తో కలిసి కూర్చున్నారు. అంటే విజయ్ పిలుపును పూర్తిగా తిరస్కరించిన పరిస్థితి లేదు. అదే సమయంలో అన్ని పార్టీలను ఒకే వేది కపైకి తీసుకురావాలన్న లక్ష్యం కూడా పూర్తిగా నెరవేరలేదు. అందుకే ఈ సమావేశాన్ని విజయ్ విజయం అనీ.. వైఫల్యం అనీ ఒక్క మాటలో చెప్పలేం.అసలు డీలిమిటేషన్ అంటే నియోజకవర్గాల పునర్విభజన. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను పునఃసర్దుబాటు చేస్తే జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందన్నది తమిళనాడు పార్టీల ఆందోళన. కుటుంబ నియంత్రణ, జనాభా నియంత్రణ వంటి అంశాల్లో ముందున్న రాష్ట్రాలకు.. తర్వాత పెరిగిన జనాభా ఆధారంగా రాజకీయ ప్రాతినిధ్యం తగ్గించడం న్యాయం కాదన్న వాదన చాలాకాలంగా ఉంది. అందుకే డీలిమిటేషన్ తమిళనాడులో కేవలం నియోజకవర్గాల లెక్క కాదు.. రాష్ట్ర హక్కుల అంశంగా మారింది.ఈ అంశంపై డీఎంకే ఇప్పటికే పోరాటం చేస్తోంది. స్టాలిన్ నేతృత్వంలో గతంలోనే అఖిలపక్ష సమావేశాలు కూడా జరిగాయి. తమిళనాడుకు అన్యాయం జరగకూడదన్న వాదనను డీఎంకే జాతీయ స్థాయిలో కూడా వినిపించింది. అంటే డీలిమిటేషన్ వ్యతిరేక పోరాటం విజయ్‌తో మొదలైంది కాదు. మరి ఇప్పుడు విజయ్ అదే అంశంపై ప్రత్యేకంగా ఎంపీల సమావేశం ఎందుకు పెట్టారు? అన్నదే అసలు రాజకీయ ప్రశ్న.ఇక్కడే విజయ్ రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. ఒక సమస్యపై అన్ని పార్టీలను ఒకే టేబుల్ దగ్గరకు తీసుకురావడం ద్వారా తాను కేవలం ఒక పార్టీ అధినేతను కాదని.. తమిళనాడు ప్రయోజనాల కోసం అందరినీ కలుపుకొని వెళ్లగల నాయకుడిననే ఇమేజ్‌ను నిర్మించుకోవాలని చూస్తున్నారా? అన్న చర్చ మొదలైంది. ఎందుకంటే ఎన్నికల్లో ప్రత్యర్థిని ఓడించడం ఒక రాజకీయ విజయం. కానీ ప్రత్యర్థి పార్టీలతో కూడా ఒక రాష్ట్ర ప్రయోజనం కోసం మాట్లాడగల స్థాయిని చూపించడం మరో రకమైన నాయకత్వ పరీక్ష.అయితే ఈ సమావేశానికి స్టాలిన్ రాకపోవడమే ఇప్పుడు విజయ్‌కి అతిపెద్ద రాజకీయ ప్రశ్నగా మారింది. స్టాలిన్ వచ్చి ఉంటే కథ మరోలా ఉండేది. విజయ్ పిలుపునకు స్పందించి స్టాలిన్ కూడా అదే వేదికపై కూర్చుని తమిళనాడు హక్కుల కోసం కలిసి పోరాడతామని ప్రకటించి ఉంటే.. విజయ్ రాజకీయ ఇమేజ్‌కు అది భారీ బూస్ట్ అయ్యేది. తనకంటే సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న స్టాలిన్‌ను కూడా ఒక సమస్యపై తన వేదికపైకి తీసుకురాగలిగాడనే ప్రచారం జరిగేది.కానీ స్టాలిన్ రాలేదు. డీఎంకే ఎంపీలు కూడా రాలేదు. ఇది విజయ్‌కు ఒకవైపు ఎదురుదెబ్బే. కానీ రాజకీయంగా మరో అవకాశం కూడా. ఎందుకంటే ఇప్పుడు విజయ్ ప్రజల్లో ఒక ప్రశ్నను బలంగా తీసుకెళ్లవచ్చు. తమిళనాడు కోసం అందరినీ పిలిచాను.. కలిసి మాట్లాడుదామని చెప్పాను. ఎవరు వచ్చారు? ఎవరు రాలేదనేది మీరు చూశారని చెప్పొచ్చు. రాజకీయాల్లో కొన్ని సందర్భాల్లో ప్రత్యర్థి గైర్హాజరు కూడా ప్రచార ఆయుధంగా మారుతుంది. స్టాలిన్ విజయ్ వేదికపైకి వచ్చి ఉంటే.. విజయ్‌కి ఒక రోజు రాజకీయ మైలేజ్ వచ్చేది. రాకపోవడంతో.. విజయ్ దాన్ని ఒక నేరేటివ్‌గా మార్చుకునే అవకాశం వచ్చింది.అయితే ఇక్కడ మరో లెక్క ఉంది. తమిళనాడుకు చెందిన మొత్తం 57 మంది ఎంపీల్లో 20 మంది మాత్రమే సమావేశానికి రావడం అంటే దాదాపు 35 శాతం మంది మాత్రమే హాజరైనట్టే. మిగిలిన 37 మంది.. అంటే దాదాపు 65 శాతం మంది రాలేదు. కాబట్టి దీనిని అన్ని పార్టీల ఏకాభిప్రాయ సమావేశంగా చెప్పడం సాధ్యం కాదు. కానీ వచ్చిన 20 మంది వివిధ పార్టీలకు చెందినవారు కావడం మాత్రం విజయ్‌కు రాజకీయంగా ఉపయోగపడే అంశం.ముఖ్యంగా కాంగ్రెస్ రావడం.. డీఎంకే దూరంగా ఉండటం ఆసక్తికరమైన పరిణామం. డీఎంకేకు కాంగ్రెస్‌తో రాజకీయ సంబంధం ఉన్నప్పటికీ.. విజయ్ ఏర్పాటు చేసిన వేదికకు కాంగ్రెస్ ఎంపీలు రావడం ద్వారా డీలిమిటేషన్‌ను పార్టీ రాజకీయాలకు అతీతమైన అంశంగా చూడాలన్న వాదన బలపడింది. అయితే దీన్ని వెంటనే కాంగ్రెస్-డీఎంకే మధ్య విభేదాలకు సంకేతంగా చూడటం తొందరపాటే అవుతోంది. కానీ విజయ్ మాత్రం ఈ పరిణామాన్ని తన రాజకీయ ప్రయోజనానికి ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఇప్పటివరకు తమిళ రాజకీయాల్లో ప్రధాన పోరు డీఎంకే వర్సెస్ అన్నాడీఎంకే. రెండు పెద్ద రాజకీయ ధృవాల చుట్టూనే ఎన్నికలు తిరిగేవి. ఇప్పుడు విజయ్ రంగంలోకి వచ్చారు. 2026 రాజకీయ సమీకరణాల్లో ఆయన ఎదుగుదలతో పాత లెక్కలకు కొత్త సవాలు ఎదురైంది. అందుకే డీలిమిటేషన్ వంటి రాష్ట్ర హక్కుల అంశం విజయ్‌కు కేవలం ఒక విధానపరమైన అంశం కాదు.. తన నాయకత్వాన్ని ప్రదర్శించుకునే రాజకీయ వేదిక కూడా.అయితే విజయ్ ముందున్న అసలు పరీక్ష ఇక్కడే ఉంది. ఒక సమావేశం పెట్టడం సులువు.. ఆ సమావేశాన్ని ఉద్యమంగా మార్చడం కష్టం. డీలిమిటేషన్‌పై నిజంగా పోరాడాలంటే పార్లమెంట్‌లో ఎంపీలను సమన్వయం చేయాలి. దక్షిణాది రాష్ట్రాలతో కలిసి వెళ్లాలి. కేంద్రంపై ఒత్తిడి పెంచాలి. కేవలం తమిళనాడు ఎన్నికల రాజకీయాలకు పరిమితం కాకుండా జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. అప్పుడు మాత్రమే విజయ్ "తమిళ హక్కుల కోసం అందరినీ కలిపే నాయకుడు" అనే ఇమేజ్ బలపడుతుంది.లేకపోతే డీఎంకే నుంచి మరో కౌంటర్ రావచ్చు. డీలిమిటేషన్‌పై మేము ఎప్పటి నుంచో పోరాడుతున్నాం. కొత్తగా విజయ్ వచ్చి మీటింగ్ పెట్టడం వల్ల ఇది కొత్త పోరాటం కాదని చెప్పే వీలుంది. అదే విజయ్‌కు పెద్ద సవాలు. ఎందుకంటే డీలిమిటేషన్ అనే అంశంపై స్టాలిన్‌కు రాజకీయ చరిత్ర ఉంది. విజయ్‌కు మాత్రం ఈ అంశంపై రాజకీయంగా కొత్త అధ్యాయం మొదలవుతోంది.అందుకే ఈ సమావేశానికి కేవలం "20 మంది ఎంపీలు వచ్చారు.. 37 మంది రాలేదు" అనే అంకెలతో చూడటం సరిపోదు. అసలు కథ.. ఎవరు వచ్చారు, ఎవరు రాలేదు.. ఎందుకు రాలేదు.. విజయ్ ఈ వేదికను తర్వాత ఎలా ఉపయోగించబోతున్నారు అన్నదే. స్టాలిన్ రాలేదు కాబట్టి విజయ్ ఓడిపోయారని చెప్పలేం. 20 మంది వచ్చారు కాబట్టి విజయ్ గెలిచారని కూడా చెప్పలేం. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. డీలిమిటేషన్ పోరాటం పాతదే.. దానిపై విజయ్ వేసిన రాజకీయ అడుగు మాత్రం కొత్తది.స్టాలిన్ దగ్గర ఈ అంశంపై అనుభవం ఉంది. విజయ్ దగ్గర కొత్త రాజకీయ ఉత్సాహం ఉంది. ఒకరి దగ్గర పోరాట చరిత్ర ఉంటే.. మరొకరు దానికి కొత్త రాజకీయ వేదికను నిర్మించాలనుకుంటున్నారు. అందుకే విజయ్ పిలుపు.. స్టాలిన్ దూరం అనేది కేవలం ఒక సమావేశం కథ కాదు.తమిళనాడు హక్కుల పేరుతో మొదలైన ఈ పోరు.. రేపటి తమిళ రాజకీయాల్లో నాయకత్వ పోరుగా మారుతుందా? డీలిమిటేషన్ సీట్లను మారుస్తుందో లేదో వేచి చూడాలి.

## రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం.. వయా పాకిస్థాన్..!

**న్యూఢిల్లీ :** రష్యా నుంచి భారత్‌కు రైల్వే కనెక్టివిటీని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆ దేశ ఉప ప్రధాని మరాట్ ఖుస్నులిన్ ప్రతిపాదించారు. ఈ మార్గం తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా సాగి హిందూ మహాసముద్రానికి చేరుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో అనుసంధానమయ్యే ఏ మార్గమైనా పరిశీలించేందుకు అనుకూలమేనని స్పష్టం చేశారు. బోస్ఫరస్, హర్మూజ్ జలసంధుల వద్ద ఎదురయ్యే భద్రతా, వాణిజ్యపరమైన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ భూభాగ మార్గాల అవసరం పెరుగుతోందని రష్యా భావిస్తోంది.రష్యా నుంచి భారత్‌కు రైలులో సరుకు రవాణా చేసే మార్గం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచంలోని కీలక సముద్ర వాణిజ్య మార్గాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో.. సముద్ర మార్గాలకు ప్రత్యామ్నాయంగా భారీ రైల్వే కారిడార్‌ను అభివృద్ధి చేసే అవకాశాన్ని రష్యా పరిశీలిస్తోంది. రష్యా ఉప ప్రధాని మరాట్ ఖుస్నులిన్ ఈ ప్రతిపాదనను ప్రస్తావించారు. రష్యా నుంచి హిందూ మహాసముద్రం వరకు రైల్వే లింక్ ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆయన సూచించారు. తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా ఈ రైల్వే మార్గాన్ని తీసుకెళ్లే అవకాశం ఉందని తెలిపారు. భారత్‌కు చేరుకునే అవకాశం కల్పించే ఏ రూట్ అయినా తమకు పరిశీలనీయమేనని పేర్కొన్నారు.బోస్ఫరస్, హోర్ముజ్ జలసంధులపై ఆధారపడే అంతర్జాతీయ వాణిజ్య మార్గాలకు భద్రతాపరమైన ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో రష్యా ఈ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైన మార్గాల్లో ఒకటి. ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు నాలుగో వంతు, ప్రపంచ ఎల్ఎన్‌జీ సరఫరాల్లో దాదాపు ఐదో వంతు ఈ ప్రాంతం గుండా సాగుతుందని అంచనా. ఈ మార్గంలో అంతరాయం ఏర్పడితే అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది.ఇటీవలి కాలంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య సైనిక ఉద్రిక్తతలు పెరగడంతో హర్మూజ్ జలసంధి ప్రాధాన్యం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో సముద్ర మార్గాల్లో అంతరాయాలు ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు అవసరమని రష్యా భావిస్తోంది. రష్యా ప్రతిపాదనల ప్రకారం సాధ్యమైన రైల్వే కారిడార్ తుర్క్‌మెనిస్తాన్ నుంచి ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా హిందూ మహాసముద్రంకు చేరేలా ఉండనుంది. ఈ మార్గం పూర్తిగా అమలులోకి వస్తే రష్యాకు సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని కొంత మేర తగ్గించే అవకాశం ఉంటుంది.ముఖ్యంగా భారత్‌తో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ తరహా భూభాగ రవాణా మార్గం ఉపయోగపడే అవకాశం ఉందని రష్యా భావిస్తోంది. అయితే ప్రతిపాదిత మార్గంలో ఉన్న దేశాల భౌగోళిక, భద్రతా, రాజకీయ పరిస్థితులు, మౌలిక వసతులు వంటి అనేక అంశాలు ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను ప్రభావితం చేయనున్నాయి.రష్యా చేస్తున్న ప్రతిపాదనలో భారత్‌కు అనుసంధానం కల్పించే మార్గాలకు ప్రత్యేక ప్రాధాన్యం కనిపిస్తోంది. భారత్‌కు చేరుకునే అవకాశం ఉన్న ఏ రూట్ అయినా పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా ఉప ప్రధాని పేర్కొనడం దీనికి సంకేతంగా భావిస్తున్నారు. ఇలాంటి రైల్వే కారిడార్ అందుబాటులోకి వస్తే రష్యా-భారత్ మధ్య సరుకు రవాణాకు కొత్త మార్గం ఏర్పడే అవకాశం ఉంటుంది. సముద్ర రవాణాలో అంతరాయాలు ఏర్పడిన సందర్భాల్లో ప్రత్యామ్నాయ మార్గంగా ఇది ఉపయోగపడవచ్చు. అయితే ఇది ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉంది. మార్గం ఖరారు, నిర్మాణ వ్యయం, దేశాల మధ్య ఒప్పందాలు, భద్రతా అంశాలు వంటి అనేక దశలను దాటాల్సి ఉంటుంది.మొత్తంగా చూస్తే.. సముద్ర వాణిజ్య మార్గాల్లో పెరుగుతున్న భద్రతా సవాళ్లకు ప్రత్యామ్నాయంగా రష్యా భూభాగ రవాణా మార్గాలపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది.

## బీజేపీతో మళ్లీ పొత్తుకు శిరోమణి అకాలీదళ్ పార్టీ ప్రయత్నాలు

**ఛండీఘడ్ :** ఏప్రిల్‌లో పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్రంలోని మోదీ సర్కారు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటుచేసి, నియోజకవర్గాల పునర్విభజన మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చింది. అయితే, ఈ రాజ్యాంగ సవరణ బిల్లు మూడింట రెండొంతుల మెజార్టీ సాధించలేక వీగిపోయింది. దీంతో మరోసారి ఈ బిల్లును తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే మద్దతు కూడగట్టి, ఎలాగైనా గట్టెక్కించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే బిల్లుకు తాజాగా ఎస్ఏడీ మద్దతు ప్రకటించింది.బీజేపీ, అకాలీదళ్ మధ్య మళ్లీ పొత్తు పొడుస్తుందనే ఊహాగానాల నడుమ కేంద్రంలోని మోదీ సర్కారు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుకు పంజాబ్‌కు చెందిన ప్రాంతీయ పార్టీ శిరోమణి అకాలీదళ్ బహిరంగంగా మద్దతు ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో అకాలీదళ్ అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ భేటీ అయిన మర్నాడే ఈ ప్రకటన వెలువడింది. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. అకాలీదళ్.. బీజేపీ కూటమి ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయని ఈ నిర్ణయం స్పష్టమైన సంకేతాన్ని ఇస్తోంది.కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ ప్రణాళికను సమర్థిస్తూ.. దేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణమే అమలు చేయాలని బాదల్ శనివారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల్లో స్థానాలను సమానంగా 50 శాతం పెంచాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఎస్ఏడీ మద్దతు ఇస్తుందని తెలిపారు. "చండీగఢ్‌లో జరిగిన పార్టీ సీనియర్ నేతల సమావేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశాం.. మహిళల గౌరవం, సమానత్వం, సమాన హక్కుల కోసం పోరాడిన సిక్కు గురువుల బోధనల నుంచి శిరోమణి అకాలీదళ్ స్ఫూర్తి పొందుతుంది. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఇప్పటికే తన సభలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి ఆదర్శంగా నిలిచింది. పార్లమెంట్ ముందుకు వచ్చిన కీలక అంశాలపై చర్చించిన అనంతరం, అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించేలా న్యాయమైన డిలిమిటేషన్ జరగాలని భావిస్తున్నాం. పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'అన్ని రాష్ట్రాల్లో 50% స్థానాల సమాన పెంపు' ప్రతిపాదనకు మేము మద్దతు ఇస్తున్నాం' అని బాదల్ వెల్లడించారు. ఏప్రిల్‌లో పార్లమెంట్‌లో డిలిమిటేషన్ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టినప్పుడు అకాలీదళ్ దానిని తీవ్రంగా వ్యతిరేకించి, ప్రతిపక్షాలతో కలిసి వ్యతిరేకంగా ఓటు వేసింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పంజాబ్‌కు తక్కువ స్థానాలు పెరుగుతాయని, ఇది పంజాబ్‌కు వివక్షపూరితమైనదని అప్పట్లో పేర్కొంది. కానీ, ఇప్పుడు పొత్తు చర్చలు వేగం పుంజుకోవడంతో 50% స్థానాల పెంపు హామీతో ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.2020లో వివాదాస్పద వ్యవసాయ చట్టాలతో బీజేపీ, అకాలీదళ్ మధ్య దాదాపు రెండున్నర దశాబ్దాల బంధం తెగిపోయింది. ఆ సమయంలో ఎన్డీయే కూటమి నుంచి అకాలీదళ్ బయటకు వచ్చింది. ఆ తర్వాత 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇరు పార్టీలు ఒంటరిగానే పోటీ చేశాయి. 2024 ఎన్నికల్లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేకపోగా, అకాలీదళ్ కేవలం ఒక స్థానానికే పరిమితమైంది.పార్లమెంట్‌లో ప్రధానితో బాదల్ శుక్రవారం భేటీ కావడంతో కూటమి పునరుద్ధరణపై ప్రచారం మొదలైంది. పంజాబ్ బీజేపీ వర్గాలు, ఎస్ఏడి, ఆర్ఎస్ఎస్‌లతో పాటు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన నేతలు కూడా పొత్తుకు అనుకూలంగా ఉన్నారు. దీనిపై బీజేపీ కేంద్ర నాయకత్వమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.గతంలో అకాలీదళ్ పెద్దన్న పాత్ర పోషించగా.. బీజేపీ చిన్న భాగస్వామిగా ఉండేది. కానీ, ఈసారి సమాన ప్రాతిపదికన పొత్తు ఉండాలని బీజేపీ కోరుతున్నట్లు సమాచారం. సీట్ల సర్దుబాటు వంటి వివరాలను తర్వాత చర్చించవచ్చని, పంజాబ్ పరిస్థితులను మెరుగుపరచడమే ప్రస్తుతం తమ ప్రాధాన్యత అని అకాలీదళ్ నేతలు చెబుతున్నారు

# తెలంగాణ రోసం పోరాడిన నిస్వార్థ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి

## పెద్ది జ్ఞాపకాలు మన గుండెల్లో ఎప్పటికీ పదిలంగా ఉంటాయి : హరీష్ రావు

**నర్సంపేట** నల్లబెల్లిలో జరిగిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి దశదిన కర్మ, సంస్మరణ సభ బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ పెద్ది సుదర్శన్ రెడ్డి తో నాకు రెండున్నర దశాబ్దాల సుదీర్ఘ అను బంధం ఉంది. కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా ఆయన తో కలిసి అనేక పోరాటాల్లో, ఉద్యమాల్లో, ఉపఎన్నికల్లో నేను పనిచేశానని అన్నారు. తెలంగాణ కోసం ప్రాణాలు, ఆస్తులు, పదవులు ఏవీ లెక్కచేయకుండా పోరాడిన నిస్వార్థ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి. మానుకోట సంఘటన అయినా, పరకాల, స్టేషన్ ఘనపూర్ ఉపఎన్నికలైనా.. ప్రతి చోటా పెద్ది సుదర్శన్ రెడ్డి పోరాట స్ఫూర్తి, ఆయన కష్టం ముందుండేది. సమైక్యవాదులు తెలంగాణ గడ్డ మీద అడుగుపెడుతుంటే.. వారి బుల్లెట్లను, రాళ్లను సైతం లెక్కచేయకుండా ముందుండి అడ్డుకున్న పోరాట యోధుడు పెద్ది. తెలంగాణ వచ్చే వరకు రాష్ట్ర సాధన కోసం పోరాడాడు. రాష్ట్రం వచ్చాక నర్సంపేట అభివృద్ధి కోసం ఎంతో తపన పడ్డాడు. ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పటికీ, ఆయన పోరాట స్ఫూర్తిని గుర్తించిన కేసీఆర్ .. క్యాబినెట్ ర్యాంక్ ఇచ్చి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్గా అవకాశం కల్పించారని అన్నారు. రామప్ప, పాకాల, లక్నవరం చెరువులకు దేవాదుల నీళ్లను అందించాలని కేసీఆర్ ని కోరి సాధించాడు. ఆయన అభ్యర్థన మేరకే కేసీఆర్ ఆనాడు దేవాదుల నీటిని విడుదల చేశారు. ఆ చెరువులకు దేవాదుల నీళ్లు వస్తున్నాయంటే అది ముమ్మాటికీ పెద్ది సుదర్శన్ రెడ్డి కృషే. తన ప్రాంత రైతులు రెండు పంటలు పండించుకోవాలని రాత్రింబవళ్లు తండ్లాడిండు. కేసీఆర్ ఆశీస్సులతో ఈ ప్రాంత ప్రజలకు గోదావరి జలాలను అందించాడు. రాష్ట్రంలో జిల్లా కేంద్రం కాని చోట మెడికల్ కాలేజీ సాధించిన ఏకైక నియోజకవర్గం నర్సంపేట. కేసీఆర్ ఆలోచనతో పాటు, ఈ ప్రాంతం మీద పెద్ది సుదర్శన్ రెడ్డికి ఉన్న ప్రేమ వల్లే ఇది సాధ్యమైంది. కాకతీయ రెడ్డి రాజులు కట్టిన దేవాలయం కూల్చివేతకు వ్యతిరేకంగా చేసిన నిరసనే నేను, పెద్ది కలిసి చేసిన చివరి కార్యక్రమం. అదే మా ఇద్దరి కలయికలో చివరిది అవుతుందని నేను కలలో కూడా అనుకోలేదు. ఒక చిన్న రైతు కుటుంబంలో పుట్టి, పోరాటాల ద్వారా ఎదిగిన నాయకుడు సుదర్శన్ రెడ్డి. ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, సివిల్ సప్లైస్ ఛైర్మన్గా, ఎమ్మెల్యేగా, బీఆర్ఎస్ కుటుంబ సభ్యుడిగా ఆయన గురించి ఎంత చెప్పుకున్నా, ఎంత మాట్లాడుకున్నా తక్కువే.గతంలో మేమిద్దరం బియ్యాల జనార్దన్ ఇంట్లో కిరాయికి ఉండేవాళ్లం. నేను, పెద్ది దాదాపు నెల, 40 రోజుల పాటు ఆ ఇంట్లో కలిసి ఉన్నాం. పరకాల, ఘనపూర్ ఉపఎన్నికల సమయంలో బాధ్యతలను భుజాన వేసుకుని పార్టీని గెలిపించుకున్నాం. అప్పుడు ఆయనకు అన్నం, నిద్ర, ఆకలి అనేవే ఉండేవి కావు. మాకు తెలంగాణ కావాలి, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధించుకోవాలని ప్రతిక్షణం తపనపడ్డ గొప్ప ఉద్యమకారుడు ఆయన. అలాంటి నాయకుడిని కోల్పోవడం కేవలం నర్సంపేటకు, ఉమ్మడి వరంగల్ జిల్లాకే కాదు.. యావత్ తెలంగాణ రాష్ట్రానికి, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు. పెద్ది సుదర్శన్ రెడ్డి లేని మీటింగ్లో, అది కూడా నర్సంపేట గడ్డ మీద నేను పాల్గొంటానని ఎప్పుడూ ఊహించలేదు. ఉద్యమ సమయంలో ఒక అమరవీరుని అంతిమ యాత్రలో పాల్గొంటున్నప్పుడు.. పోలీసులతో జరిగిన తోపులాటలో నేను డీసీఎం పైనుంచి కింద పడిపోయాను. అప్పుడు నన్ను పెద్ది సుదర్శన్ రెడ్డి ఏ ఆసుపత్రిలో అయితే చేర్పించి ప్రాణాలు కాపాడాడో.. అదే ఆసుపత్రిలో ఆయనను నేను చివరిచూపు చూడాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదని అన్నారు.



(ఈ విషయాన్ని చెబుతూ హరీశ్ రావు తీవ్ర భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు). కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను భయపెట్టినా, ప్రలోభపెట్టినా, ఎన్ని రకాలుగా ఒత్తిడి చేసినా ఆయన తలొగ్గలేదు. ప్రభుత్వ అక్రమాల మీద అదే పాత ఉద్యమ స్ఫూర్తితో చివరి శ్వాస దాకా కొట్లాడిండు. భౌతికంగా సుదర్శన్ రెడ్డి మన మధ్య లేకపోయినా.. ఆయన చేసిన పోరాటం, ప్రజల కోసం పడ్డ తపన, ఆయన జ్ఞాపకాలు మన గుండెల్లో ఎప్పటికీ పదిలంగా ఉంటాయని అన్నారు.

# కమలాపూర్ మండలంలో డబల్ బెడ్రూంలు కట్టింది కేసీఆర్

ఈరోజు మీరు ప్రారంభించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేసీఆర్ కట్టించినవే

అబద్ధాలు చెబితే ఊరుకునేది లేదు.. నిజాలు మాట్లాడాలి, రాజకీయాలు చేయొద్దు

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

కమలాపూర్లో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విజ్ఞప్తి



**కమలాపూర్ :** కమలాపూర్ మండలంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ గారు మాట్లాడుతున్న సమయంలో రాజకీయ విమర్శలు, వాస్తవాలకు విరుద్ధమైన వ్యాఖ్యలు చేయడంపై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. "అబద్ధాలు చెప్పొద్దు.. నిజాలు మాట్లాడాలి. ఇది రాజకీయాలు చేయాల్సిన వేదిక కాదు. ప్రజలకు వాస్తవాలు చెప్పండి" అని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో రాజకీయ విమర్శలు చేయడం కంటే, ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**డబుల్ బెడ్రూమ్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి**

కేసీఆర్ గారు నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ప్రారంభించడానికి వచ్చిన మంత్రులు.. కేవలం ప్రారంభోత్సవం చేసి వెళ్లకుండా, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా పరిష్కరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్, రోడ్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంకా కొన్ని డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకుండా మిగిలిపోయాయని, వాటికి అవసరమైన నిధులు కేటాయించి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. చిన్నచిన్న నిర్మాణ పనులు, మిగిలిపోయిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన ఆర్థిక సహాయం కూడా అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం డబుల్ బెడ్రూమ్ ఇళు అందుకున్న లబ్ధిదారులకు ఇళ్లలో అవసరమైన చిన్నచిన్న పనులు చేసుకునేందుకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ఇదే వేదిక నుంచి మంత్రులను ఎమ్మెల్యే కోరారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయం, ఆడపిల్లల వివాహాలకు కళ్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం, పెన్షన్ల పెంపు వంటి హామీలను ఏమయ్యాయని ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఉప్పల్ మరి యు చల్లూరు మండలంగా ఏర్పాటు చేయాలి కమలాపూర్ మండలంలోని ఉప్పల్ ని వీణవంక మండలం లో చల్లూరు ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉప్పల్ ప్రాంతంలో దాదాపు 8 వేల మంది జనాభా ఉందని, మండలంగా ఏర్పాటు చేయడానికి అవసరమైన అన్ని అర్హతలు ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని రవాణా శాఖ మంత్రిగా ఉన్నారు. కమలాపూర్ బస్టాండుకు రూ.2 కోట్లు కేటాయించాలి. కమలాపూర్ బస్టాండ్ నిర్మాణం కూడా పూర్తికాకుండా ఉందని ఎమ్మెల్యే తెలిపారు

# బీసీల సెంట్రిక్‌గా కవిత



**హైదరాబాద్ :** తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త పార్టీ పెట్టుకున్న మాజీ ఎంపీ, మాజీ సీఎం కేసీఆర్ తనయ కవిత.. ఇప్పుడు వ్యూహం మార్చుకున్నట్టు తెలుస్తోంది. నిన్న మొన్నటి వరకు తెలంగాణ సెంటిమెంటు, ఉద్యమ కారులు.. వారి హక్కులు, ఉద్యోగాలు అంటూ.. రాజకీయ నినాదాలు చేసిన కవిత.. వీటి వల్ల వర్కవుట్ కాదని అర్థం చేసుకున్నట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె.. తన పంథాను సమూలంగా మార్చుకు న్నట్టు కనిపిస్తున్నారు.ప్రస్తుతం తెలంగాణలో బీసీ సామాజిక వర్గం అధికారిక లెక్కల ప్రకారం.. 43 శాతం మంది ఉన్నారు. అనధికారికంగా 50 శాతం వరకు ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీసీలను తనవైపు తిప్పుకునే దిశగా కవిత రాజకీయాలకు పదును పెట్టినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం బీసీ ఓటు బ్యాంకు నికరంగా ఎవరికీ ఎడాప్ట్ కాలేదు. బీఆర్ఎస్ అయినా.. బీసీ గణనను తొలిసారి నిర్వహించామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీకైనా బీసీలు పూర్తిగా అంకితం కాలేదు. ఈ నేపథ్యంలో వారిని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు కవిత ప్రయత్నం చేస్తున్నారు.ఈ నేపథ్యంలోనే బీసీల హక్కుల సాధన, ఏపీలో చేస్తున్న బీసీల రక్షణ హక్కు చట్టం తరహాలో తెలంగాణలోనూ బీసీలకు రక్షణ హక్కు తీసుకురావాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు. అంతేకాదు.. రాజకీయంగా అదేవిధంగా రాజ్యాంగ పరంగా కూడా.. బీసీలకు 50 శాతం పదవులు కేటాయించాలని కోరుతున్నారు. వాస్తవానికి కవిత బీసీ కాకపోయినా.. ఆ వర్గాన్ని తనదైన శైలిలో తనవైపు తిప్పుకొనేందుకు బీసీల సమస్యలను భుజాని వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేవలం నినాదాలకే పరిమితం కారాదని కూడా కవిత నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.బీసీల కోసం ఉద్యమం చేయాలనే దిశగా కవిత ఆలోచన చేస్తున్నారు. ముఖ్యంగా పార్లమెంటు నుంచే ఆమె పని ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది. గతంలో తెలంగాణ సాధన కోసం కేసీఆర్ వెయ్యి కార్లతో పార్లమెంటుకు పెరేడ్ నిర్వహించిన తరహాలో బీసీల కోసం.. వెయ్యి కార్లతో పార్లమెంటుకు పెరేడ్ నిర్వహించి.. ఢిల్లీ నుంచే తన వ్యూహాన్ని పెంచాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన కార్యాచరణపై ప్రస్తుతం కవిత కసరత్తు చేస్తున్నారు. ఇది అయిన తర్వాత.. రాష్ట్ర వ్యాప్తంగా బీసీల కోసం ఉద్యమం నిర్మించి.. జిల్లాల వారీగా పర్యటనలు చేయాలనినిర్ణయించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఇది ఏమేరకు వర్కవుట్ అవుతుందో చూడాలి.

## నేతన్నల సేవలో మంత్రి సవిత పథకంపై సమీక్ష

**అమరావతి** రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులతో కలిసి అలాగే ప్రతి జిల్లా చేనేత అధికారులతో మంత్రి సవిత జూమ్ మీటింగ్ ద్వారా 'నేతన్నల సేవలో' పథకంపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రారంభించిన 'నేతన్నల సేవలో' పథకం ద్వారా రాష్ట్రంలోని చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాం. ఇప్పటికే 71,536 మంది నేతన్నలకు ఒక్కొక్కరికి రూ.25,000 చొప్పున ఆర్థిక సాయం అందించామని మంత్రి అన్నారు. ఇంకా మిగిలిపోయిన అర్హులైన నేతన్నలకు కూడా వారం రోజుల్లో రూ.25,000 చొప్పున ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. 'నేతన్నల సేవలో' పథకానికి 13,678 మంది దరఖాస్తు చేసుకోగా, అర్హులను గుర్తించి వారికి కూడా నేతన్నల నేస్తం పథకం వర్తింపజేస్తాం. 50 ఏళ్లు నిండిన 85,678 మంది చేనేత కార్మికులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తున్నాం. 62,541 మంది నేతన్నల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. అర్హత ఉన్న ప్రతి నేతన్నకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యం. ఆ దిశగా ఎలాంటి అర్హుడు మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డికి కేటీఆర్ నివాళి

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సంపేటలో నిర్మించనున్న మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టనున్నట్లు కేటీఆర్ కీలక ప్రకటన చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని అగ్రభాగాన నిలిచి నడిపించిన గొప్ప నాయకుడు పెద్ది అని ఆయన కొనియాడారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "ఎంతకాలం జీవించామన్నది ముఖ్యం కాదు, ఎలా జీవించామన్నదే ప్రధానం. పెద్ది సుదర్శన్ రెడ్డి ఒక్క పర్యాయం ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసేలా పనిచేశారు" అని వ్యాఖ్యానించారు. ఆయన అంత్యక్రియలకు పోటెత్తిన అశేష జనవాహిని, ప్రజల్లో ఆయనకు ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు.పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న సుదర్శన్ రెడ్డి, జులై 31న గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన గతంలో జడ్పీటీసీ సభ్యుడిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సేవలందించడంతో పాటు, 2018-2023 మధ్య కాలంలో నర్సంపేట ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించారు.కాగా, నిన్న ఆదివారం నాడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్రమంలో పార్టీ తరఫున ప్రకటించిన రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందులో సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లల పేరున ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున, ఆయన తల్లి సంక్షేమం కోసం రూ. 25 లక్షలను కేటాయించారు.

## మెడికో ప్రియాంక మృతి..

**నిందితులను కఠినంగా శిక్షించాలన్న తెలంగాణ ప్రభుత్వం**

**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో గత వారం మాల్ వద్ద కారుతో ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన తెలంగాణ మెడికో కె. ప్రియాంక (28) చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను అత్యంత కఠినంగా శిక్షించాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఇవాళ పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, గాంధీ ఆసుపత్రికి వెళ్లి ప్రియాంక కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చూసేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడతారని ఆయన హామీ ఇచ్చారు.తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా, ఏక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన ప్రియాంక, రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో ఎండీ చదువుతున్నారు. ఈ నెల 3వ తేదీ రాత్రి, తన స్నేహితుడు ఉమేశ్‌తో కలిసి స్కూటీపై మాల్ నుంచి బయటకు వస్తుండగా ఈ ఘోరం జరిగింది. మద్యం మత్తులో ఉన్న సురవరపు దశవంత్, ఆండ్రూ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు వ్యక్తులు మాల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో వారితో గొడవపడి, దాడి చేసి, అక్కడి నుంచి కారులో వేగంగా పారిపోయే ప్రయత్నంలో మాల్ గేటు వద్ద ఉన్న ప్రియాంక స్కూటీని మూడుసార్లు ఢీకొట్టారు.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రియాంకను మొదట స్థానిక ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమెను వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించగా, నిన్న తుదిశ్వాస విడిచారు. ఆమె మృతదేహానికి గాంధీ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి, అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామానికి తరలించనున్నారు.ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి, ప్రియాంక కుటుంబానికి రూ. 20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. మొదట నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రియాంక మరణంతో ఇప్పుడు ఆ సెక్షన్‌ను హత్యా నేరంగా మార్చే అవకాశం ఉంది. నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ప్రియాంక తండ్రి వెంకటేశ్ రాజమహేంద్రవరంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నిందితులకు కఠిన శిక్ష పడితే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని మంత్రి శ్రీహరి అభిప్రాయపడ్డారు. ప్రియాంక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు

## హైదరాబాద్ వాసులకు గుడ్‌న్యూస్:

## సులభం కానున్న బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ

**హైదరాబాద్ :** జనన, మరణ ధ్రువపత్రాల జారీలో జాప్యాన్ని నివారించి, ఆ ప్రక్రియను మరింత సరళతరం చేసేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) సిద్ధమవుతోంది. నగరవాసుల సౌకర్యార్థం 'సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్' (సీఆర్ఎస్) పేరుతో సరికొత్త ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తోంది. దీని ద్వారా ప్రజలు ఆన్‌లైన్‌లోనే జనన, మరణాలను సులువుగా నమోదు చేసుకుని, వేగంగా ధ్రువపత్రాలను పొందే వీలుంటుంది.జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇటీవల అధికారులతో ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. జనన, మరణాల నమోదు, సకాలంలో ధ్రువపత్రాల జారీ అనేది జీహెచ్ఎంసీ ప్రాథమిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. రాబోయే కొత్త పోర్టల్ పనితీరుతో పాటు జనన, మరణాల నమోదు చట్టంపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ నూతన డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల పార్లమెంట్ ఆమోదించి, రాష్ట్రపతి సంతకంతో అమల్లోకి వచ్చిన జనన, మరణాల నమోదు (సవరణ) చట్టం-2026 నేపథ్యంలో జీహెచ్ఎంసీ తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. నూతన చట్టం ప్రకారం, జనన లేదా మరణాల నమోదులో జాప్యం జరిగితే కఠినమైన నిబంధనలు వర్తిస్తాయి.ఒకటి నుంచి రెండేళ్లలోపు జాప్యం జరిగితే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటితే మాత్రం ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నుంచి మాత్రమే ఉత్తర్వులు పొందాల్సి ఉంటుంది. ఈ కఠిన నిబంధనల దృష్ట్యా, పౌరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడటంలో జీహెచ్ఎంసీ ప్రవేశపెట్టనున్న 'సీఆర్ఎస్' పోర్టల్ కీలక పాత్ర పోషించనుంది.

## భూ కబ్జాదారుల పెత్తనానికి చరమగీతం

**విజయవాడ :** రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అరాచకాలకు, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలకు శాశ్వతంగా చరమగీతం పాడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో తాము పనిచేస్తుంటే, ప్రతిపక్ష వైసీపీ మాత్రం శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. సోమవారం ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో నిర్వహించిన భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు.ప్రతి నెల 9వ తేదీన భూ సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించి, నేరుగా ప్రజల వద్దకే వచ్చి పట్టాలు అందిస్తున్నామని చంద్రబాబు తెలిపారు.

## బిజినెస్

### ఏఐ డేటా సెంటర్లతో అధిక వేతన ఉద్యోగాలు: ఎన్విడియా సీఈఓ



**ఇంటర్నెట్ డెస్క్:** కృత్రిమ మేధ రాకతో ఓవైపు టెక్ కంపెనీల్లో వరుస లేఆఫ్‌లు కలవరపెడుతున్నాయి. మరోవైపు గ్రాడ్యుయేట్లు ఉద్యోగాలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. అయితే, ఏఐ కారణంగా పెద్దఎత్తున డేటా సెంటర్లు ఏర్పాటవుతున్నాయి. వీటివల్ల ఉపాధి అవకాశాలు పెద్దగా ఉండబోవన్న ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్ రంగానికి అతీతంగా ఏఐ అధిక వేతన ఉద్యోగాలను సృష్టిస్తుందని అభిప్రాయపడ్డారు. డేటా సెంటర్ల నిర్మాణంతో ఇది సాధ్యం కానుందని చెప్పారు. కానీ వైట్ కాలర్ రంగంలో మాత్రం ఆ అవకాశం ఉండకపోవచ్చన్నారు. "ఏఐ రాకతో టెక్ రంగంలో కాకుండా ఇతర రంగాల్లో భారీగా ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ డేటా సెంటర్లపై టెక్ కంపెనీలు భారీగా ఖర్చు చేస్తున్నాయి. దశాబ్దం చివరి నాటికి దాదాపు 7 ట్రిలియన్ డాలర్లకు పెట్టుబడులు చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏఐ డేటా సెంటర్ల నిర్మాణానికి అవసరమైన, నైపుణ్యం కల్గిన ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు..తదితర శ్రామికుల కొరత ఉంది. రాబోయే రోజుల్లో ఏఐ డేటా సెంటర్లు భారీగా రానున్నాయి. వాటి నిర్మాణం, నిర్వహణకు ప్లంబర్లు, సూపర్ వైజర్లకు భారీ డిమాండ్ ఏర్పడనుంది. నైపుణ్యం ఉన్న వర్కర్లు ఏడాదికి లక్ష డాలర్లు (సుమారు రూ.84 లక్షలకు పైగా) సంపాదించొచ్చు" అని తెలిపారు. ఏఐ యుగంలో మంచి ఆదాయం పొందడానికి కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేయాల్సిన అవసరంలేదన్నారు. నైపుణ్యాధారిత పనులు వచ్చిన వారికి కూడా సురక్షిత భవిష్యత్తు ఉంటుందన్నారు.

### దిగుమతి సుంకం పెంపు..
### బంగారం, వెండితో 10వేల కోట్లు

**దిల్లీ:** దేశంలో బంగారం, వెండి కొనుగోళ్లను నియంత్రించేందుకు దిగుమతి సుంకాలు సవరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. మే 13 నుంచి ఆగస్టు 2 మధ్య బంగారం, వెండి, ప్లాటినమ్‌పై కస్టమ్స్ డ్యూటీ రూపంలో రూ.10,463 కోట్లు వసూలైనట్లు కేంద్రం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హర్మూజ్ మూసివేత నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు భారీగా పెరిగాయి. ఆహారం, ఎరువుల ధరలకూ రెక్కలొచ్చాయి. దీంతో విదేశీ మారకం నిల్వలు కాపాడుకునేందుకు ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టింది. అందులో కస్టమ్స్ సుంకాల సవరణ ఒకటి. ఆయా లోహాలపై దిగుమతి సుంకం పెంచడం ద్వారా కొనుగోళ్లు తగ్గించాలన్నది ప్రభుత్వ వ్యూహం. ఇందులో భాగంగా బంగారం, వెండిపై 6 శాతంగా ఉన్న కస్టమ్స్ సుంకాన్ని మే 13న 15 శాతానికి సవరించింది. ప్లాటినంపైనా 6.4 శాతం నుంచి 15.4 శాతానికి చేర్చింది. ఈ క్రమంలో మే 13 నుంచి ఆగస్టు 2 మధ్య బంగారంపై రూ.10,040 కోట్లు సుంకాల రూపంలో వసూలైంది.

# రికార్డు స్థాయిలో భారత్‌లోకి రష్యన్ చమురు

దిల్లీ: భారత్‌లోకి రష్యా చమురు వరద పారుతోంది. పశ్చిమ దేశాల ఆంక్షలు కొనసాగుతున్నా డిస్కౌంట్ ధరకే లభిస్తున్న రష్యన్ క్రూడ్ పెద్దఎత్తున దిగుమతి అవుతోంది. ఈ ఏడాది వరుసగా రెండో నెలా జులైలో రికార్డు స్థాయిలో రష్యన్ చమురు దిగుమతి అయ్యింది. ఈ మేరకు సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ సంబంధిత డేటాను విడుదల చేసింది. దీని ప్రకారం.. జులైలో 5.5 బిలియన్ యూరోల విలువైన రష్యా క్రూడ్‌ను భారత్ దిగుమతి చేసుకుంది. జూన్‌తో పోలిస్తే పరిమాణ పరంగా 2.1 శాతం అధికం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి రష్యన్ క్రూడ్‌పై భారత్ ఆధారపడడం గణనీయంగా పెరిగింది. 2021లో రష్యా నుంచి భారత్‌లోకి దిగుమతయ్యే చమురు రోజుకు లక్ష బ్యారెళ్ల కంటే తక్కువే. అంటే భారత్‌లోకి దిగుమతయ్యే మొత్తం ముడి చమురులో దీని వాటా 2.5 శాతం కంటే తక్కువే అన్నమాట. అలాంటిది ఉక్రెయిన్‌తో వార్ అనంతరం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 2022 నాటికి ఈ సంఖ్య రోజుకు 7.40 లక్షల బ్యారెళ్లకు, 2023 నాటికి సుమారు 18 లక్షల బ్యారెళ్ల మిలియన్ బ్యారెళ్లకు చేరుకుంది. దీంతో అప్పట్లో భారత్ దిగుమతుల్లో రష్యా వాటా 39 శాతానికి చేరింది. ఈ ఏడాది జులైలోనూ భారతీయ రిఫైనరీలు రికార్డు స్థాయిలో క్రూడ్‌ను దిగుమతి చేసుకున్నాయి. సగటున రోజుకు 28 లక్షల బ్యారెళ్ల రష్యన్ క్రూడ్ దిగుమతి అయ్యింది. భారత్ మొత్తం దిగుమతుల్లో రష్యా చమురు వాటా 55.5 శాతానికి చేరింది. ఉక్రెయిన్




యుద్ధం తర్వాత రష్యా క్రూడ్ ఎగుమతుల్లో చైనా తర్వాత భారత్ రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా అవతరించింది. జులై నెలలో జామ్‌నగర్, పారాదీప్ వంటి పెద్ద టెర్మినల్స్ కాకుండా.. హెచ్‌ఎంఎల్ ముంద్రా, వాడినార్ ఎస్‌ఎంపీఎల్ టెర్మినల్, ముంబయి టెర్మినల్స్‌లో దిగుమతులు పెరిగాయి. రష్యన్ క్రూడ్‌ను శుద్ధి చేస్తున్న భారతీయ రిఫైనరీలు.. ఆంక్షలు విధించిన దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. జులైలో ఈయూ, ఆస్ట్రేలియా, అమెరికా దేశాలకు చమురు ఉత్పత్తుల రవాణా కొనసాగిందని సీఆర్ఈఏ పేర్కొంది.

## ఇథనాల్ తయారీకి చెరకు వాడకంపై కేంద్రం కోత?

దేశీయంగా రికార్డు స్థాయికి చేరిన చక్కెర ధరలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాబోయే అక్టోబరు నుంచి ప్రారంభమయ్యే నూతన మార్కెటింగ్ సీజన్‌లో ఇథనాల్ తయారీ కోసం చెరకు వినియోగాన్ని పరిమితం చేయాలని యోచిస్తోంది. దేశీయ వినియోగానికి ప్రథమ ప్రాధాన్యమిస్తూ మార్కెట్‌లో చక్కెర లభ్యతను పెంచడం, తద్వారా భగ్గుమంటున్న నిత్యావసర ధరలను అదుపు చేయడమే ఈ ప్రతిపాదన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం.

దేశంలో చక్కెర ఉత్పత్తికి కీలకంగా ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఈసారి వర్షపాతం కొరవడటంతో రాబోయే పంట దిగుబడిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు సరఫరా తగ్గిపోవడం, సమీపిస్తున్న పండుగల సీజన్ దృష్ట్యా వినియోగం పెరగడంతో గత నెల రోజుల్లోనే చక్కెర ధరలు ఏకంగా 10 శాతం మేర పెరిగి గరిష్ఠ స్థాయికి చేరాయి. పరిస్థితులు చేయిదాటిపోకుండా ఉండటానికి, విదేశాల నుంచి అత్యవసర దిగుమతులు చేసుకునే పరిస్థితి రాకుండా నివారించేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. గడిచిన ఏడాది కాలంలో చక్కెర మిల్లులు



సుమారు 30 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెరను (మొత్తం ఉత్పత్తిలో దాదాపు 10 శాతం) ఇథనాల్ తయారీకి మళ్లించాయి. అయితే నూతన నిబంధనల ప్రకారం, నేరుగా 'చెరకు రసం' అలాగే అధిక చక్కెర తీవ్రత ఉండే 'బీ-హెవీ' మోలాసెస్ నుంచి ఇథనాల్ ఉత్పత్తిని నిలిపివేయాలని మిల్లులను ఆదేశించే అవకాశం ఉంది. దీనికి బదులుగా చక్కెర సేకరించగా మిగిలిన వ్యర్థ పదార్థమైన 'సీ-హెవీ' మోలాసెస్ నుంచి మాత్రమే ఇథనాల్ ఉత్పత్తికి అనుమతించనున్నారు. అయితే, పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలనే ఈ-20 జాతీయ లక్ష్యానికి విఘాతం కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. చెరకు ద్వారా తగ్గే ఇథనాల్ కోటాను భర్తీ చేయడానికి దేశంలో ప్రస్తుతం పుష్కలంగా లభ్యమవుతున్న మొక్కజొన్న, బియ్యం నిల్వలను ఇథనాల్ తయారీకి విస్తృతంగా వినియోగించుకోవాలని భావిస్తోంది. ఈ సమతుల్య విధానం అమలులోకి వస్తే దేశీయంగా చక్కెర సరఫరా స్థిరపడి సామాన్య వినియోగదారులకు ధరల భారం నుంచి ఉపశమనం లభిస్తుందని ఆర్థిక రంగానికి చెందిన నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## చరిత్ర సృష్టించిన మిచెల్ మార్ష్..
# టీ20ల్లో అరుదైన రికార్డు

ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్ మిచెల్ మార్ష్ పొట్టి క్రికెట్‌లో అరుదైన రికార్డు సాధించాడు. ఒకే ఏడాదిలో 1500 టీ20 పరుగులు పూర్తి చేసిన తొలి ఆసీస్ బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు. హండ్రెడ్ 2026లో సన్‌రైజర్స్ లీడ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అతడు.. తాజాగా వెల్ష్ ఫైర్‌తో జరిగిన మ్యాచ్‌లో (34 బంతుల్లో 50) ఈ ఘనత సాధించాడు. మిచ్ మార్ష్‌కు ముందు ఈ రికార్డు టిమ్ డేవిడ్ పేరిట ఉండేది. 2022లో అతడు 1461 పరుగులు చేశాడు. 2024లో ట్రావిస్ హెడ్ 1442 పరుగులతో టిమ్‌కు దగ్గరగా వచ్చాడు. ఈ ఏడాది ఇప్పటివరకు 35 మ్యాచ్‌లు ఆడిన మార్ష్.. 44.17 సగటున, 160కి దగ్గరగా స్ట్రైక్‌రేట్‌తో, రెండు సెంచరీలు, 11 అర్ధ సెంచరీల సాయంతో 1502 పరుగులు చేసి టిమ్ డేవిడ్ రికార్డును బద్దలు కొట్టాడు. మార్ష్ అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియా తరఫున, బిగ్ బాష్ లీగ్‌లో పెర్త్ స్కార్చర్స్, ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్, ది హండ్రెడ్‌లో సన్‌రైజర్స్ లీడ్స్ తరఫున ఆడుతూ ఈ పరుగులు సాధించాడు.



### కోహ్లి, ఏబీడీ సరసన చోటు

ఈ ఏడాది టీ20ల్లో 1500 పరుగులు సాధించడంతో మార్ష్ విరాట్ కోహ్లి, ఏబీ డివిలియర్స్ సరసన చేరాడు. విరాట్ 2016లో 1614 పరుగులు చేయగా.. ఏబీడీ 2019లో 1580 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా ఓ క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టీ20 పరుగుల ప్రపంచ రికార్డు మాత్రం వెస్టిండీస్ స్టార్ నికోలస్ పూరన్ పేరిట ఉంది. 2024లో పూరన్ ఏకంగా 2331 పరుగులు చేశాడు.

### హండ్రెడ్‌లోనూ చరిత్రకు చేరువలో..!

హండ్రెడ్‌లోనూ మార్ష్ మరో రికార్డుకు చేరువలో ఉన్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన ఏడు ఇన్నింగ్స్‌ల్లో 374 పరుగులు చేసిన అతడు.. ఓ హండ్రెడ్ సీజన్‌లో అత్యధిక పరుగుల రికార్డుకు 51 పరుగుల దూరంలో ఉన్నాడు. ఈ రికార్డు ప్రస్తుతం జేమ్స్ విన్స్ పేరిట ఉంది. విన్స్ 2024లో సదర్న్ బ్రేవ్ తరఫున 424 పరుగులు చేశాడు. గత కొన్నేళ్లలో మార్ష్ తన బ్యాటింగ్ తీరును చాలా మార్చుకున్నాడు. ఒకప్పుడు ప్రధానంగా ఆల్‌రౌండర్‌గా కనిపించిన అతడు ఇప్పుడు టాపార్డర్‌లో విధ్వంసక బ్యాటర్‌గా మారాడు. మొత్తం టీ20 కెరీర్‌లో మార్ష్ ఇప్పటివరకు 7033 పరుగులు చేశాడు. అతడి సగటు 34.64 కాగా.. స్ట్రైక్‌రేట్ 141.48.

### సీఎస్‌కే హెడ్‌కోచ్‌గా బ్రెండన్ మెక్‌కల్లమ్!

ఐపీఎల్-2027 సీజన్‌కు ముందు చెన్నై సూపర్ సూపర్ కింగ్స్ తమ కొత్త హెడ్‌కోచ్ కోసం వేట ప్రారంభించింది. హెమాంగ్ బదానీ, రవిచంద్రన్ అశ్విన్, రాహుల్ ద్రవిడ్ వంటి భారత మాజీ ఆటగాళ్ల పేర్లు ప్రచారంలోకి వచ్చినప్పటికీ.. సీఎస్‌కే మాత్రం విదేశీ హెడ్ కోచ్ కోసం వెతుకుతున్నట్లు తెలుస్తోంది. స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో మరో న్యూజిలాండ్ లెజెండ్ బ్రెండన్ మెక్‌కల్లమ్‌ను తమ జట్టు ప్రధాన కోచ్‌గా ఎంపిక చేయాలని సీఎస్‌కే భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా మెక్‌కల్లమ్ ఇటీవల ఇంగ్లండ్ టెస్టు జట్టు హెడ్‌కోచ్ బాధ్యతల నుంచి తప్పుకొన్న సంగతి తెలిసిందే. అయితే అతడు ఇంగ్లీష్ జట్టు వైట్‌బాల్ కోచ్‌గా మాత్రం కొనసాగుతున్నాడు. త్వరలోనే ఈ పదవి నుంచి కూడా అతడు వైదొలిగే అవకాశమున్నట్లు పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి. ఇకపై అతడు ఫ్రాంచైజీ క్రికెట్‌పై దృష్టిసారించే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది. కాగా మెక్‌కల్లమ్‌కు సీఎస్‌కేతో మంచి అనుబంధం ఉంది. అతడు ఫ్లెమింగ్ నాయకత్వంలో సీఎస్‌కే తరఫున ఆడాడు. ఈ నేపథ్యంలోనే అతడిని తమ కోచ్‌గా నియమించాలని నియమించాలని భావిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. కానీ దీనిపై సీఎస్‌కే నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మరోవైపు ముంబై ఇండియన్స్ కెప్టెన్, స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాను ట్రేడ్ చేసుకోవడానికి కేకేఆర్, లక్నో సూపర్ జెయింట్స్‌తో పాటు సీఎస్‌కే కూడా ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం ఫ్రాంచైజీ పూర్తి



దృష్టి హెడ్ కోచ్ ఎంపికపైనే ఉందంట. కోచ్ ఎంపిక ఖారారైన తర్వాతే పాండ్యాపై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది.

## స్పోర్ట్స్

### వైభవ్ కాదు.. అతడి సెలక్షన్ ఒక అద్భుతం!








పంజాబ్ యువ పేసర్ గుర్నూర్ బ్రార్ టీమిండియా తరఫున అద్భుతంగా రాణిస్తున్న సంగతి తెలిసిందే. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లకు బ్యాకప్ బౌలర్‌ను వెతుకుతున్న సమయంలో సెలక్టర్ల దృష్టిలో పడ్డాడు గుర్నూర్. 6 అడుగుల 5 అంగుళాల పొడవున్న ఈ రైట్ ఆర్మ్ పేసర్.. గంటకు 142 కిలోమీటర్లకు పైగా వేగంతో బౌలింగ్ చేస్తూ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెడుతున్నాడు. వన్డేల్లో తనను నిరూపించుకున్న గుర్నూర్.. ఇప్పుడు రెడ్ బాల్ క్రికెట్‌లో సత్తాచాటేందుకు సిద్ధమయ్యాడు. ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా శ్రీలంకతో జరిగే తొలి టెస్టులో గుర్నూర్ అరంగేట్రం చేసే అవకాశముంది. ఈ నేపథ్యంలో గుర్నూర్ బ్రార్‌పై టీమిండియా మాజీ పేసర్ జహీర్ ఖాన్ ప్రశంసల వర్షం కురిపించాడు. గుర్నూర్‌కు మంచి బౌలింగ్ స్కిల్స్ ఉన్నాయని, సుదీర్ఘ కాలం పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతాడని జహీర్ కొనియాడాడు. "అధిక వేగంతో బౌలింగ్ చేయగల యువ ఫాస్ట్ బౌలర్లు భారత జట్టులోకి వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. గుర్నూర్ బ్రార్ వంటి యంగ్ పేసర్‌ను త్వరితగతిన జట్టులోకి తీసుకోవడం చాలా మంచి నిర్ణయం. అతడికి అద్భుతమైన టాలెంట్ ఉంది. బంతిని ఇరువైపులా స్వింగ్ చేయగలడు. కేవలం ఒక్క వేగమే కాదు సరైన లైన్ అండ్ లెంగ్త్‌తో కూడా బౌలింగ్ చేయగలడు. అతడు సుదీర్ఘ కాలం పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతాడని నేను నమ్ముతున్నానని ఓ ఇంటర్వ్యూలో జహీర్ పేర్కొన్నాడు. కాగా 26 ఏళ్ల గుర్నూర్ బ్రార్ గత కొంతకాలంగా మూడు ఫార్మాట్లలోనూ నిలకడగా రాణిస్తున్నాడు. రంజీ ట్రోఫీ 2024-25 సీజన్‌లో పంజాబ్ తరఫున గుర్నూర్ అద్భుత ప్రదర్శన చేశాడు. కేవలం 7 మ్యాచ్‌లలోనే 26 వికెట్లు పడగొట్టి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఆ తర్వాత పంజాబ్ టీ20 లీగ్‌లో కూడా టాప్ వికెట్ టేకర్‌గా(22) అతడు నిలిచాడు. ఐపీఎల్‌లో మాత్రం అతడు ఇప్పటివరకు కేవలం ఒకే ఒక మ్యాచ్ ఆడాడు. అయినప్పటికి అతడి టాలెంట్‌ను పరిగణలోకి తీసుకుని జాతీయ జట్టులో సెలక్టర్లు చోటిచ్చారు. అఫ్గానిస్తాన్‌తో వన్డే సిరీస్‌లో అరంగేట్రం చేసిన గుర్నూర్ తన సూపర్ బౌలింగ్‌తో అందరిని ఆకట్టుకున్నాడు. ఇప్పటివరకు ఆడిన 6 వన్డేల్లో అతడు 11 వికెట్లు పడగొట్టాడు. దీంతో ఇప్పుడు టెస్ట్ జట్టులో కూడా అతడు చోటు కొట్టేశాడు.!

# పాన్ ఇండియా మార్కెట్‌లోకి కిరణ్ అబ్బవరం



తెలుగు యంగ్ హీరోల్లో కిరణ్ అబ్బవరం ఒకడు. షార్ట్ ఫిల్మ్‌తో కెరీర్ ప్రారంభించి, రాజావారు రాణిగారు' మూవీతో హీరో అయ్యాడు. తర్వాత పలు సినిమాలు చేశాడు గానీ చాలావరకు ఫ్లాపులే. ఎట్టకేలకు 'క' అనే థ్రిల్లర్ సినిమాతో సక్సెస్ అందుకున్నాడు. దీని తర్వాత వచ్చిన 'దిల్‌రుబా' డిజాస్టర్ కాగా.. కె ర్యాంప్, చెన్నై లవ్ స్టోరీ చిత్రాలు సక్సెస్ అయ్యాయి. ప్రస్తుతం ఓ వెబ్ సిరీస్, దర్శకుడిగా ఓ మూవీ చేస్తున్న కిరణ్ అబ్బవరం.. ఇప్పుడు పాన్ ఇండియా వైడ్ తన అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యాడు. 'ఇంద్రపుత్ర' పేరుతో మూవీని అనౌన్స్ చేశారు. సోమవారం ఈ టైటిల్ ప్రకటిస్తూ ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. కాటమరాయుడు, గాండీవధారి అర్జున, కుడి ఎడమైతే, కాంతార ఛాప్టర్ 1 సినిమాలకు పనిచేసిన శ్రీకాంత్ పుప్పాల దీంతో దర్శకుడిగా మారుతున్నాడు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కిరణ్ అబ్బవరం పాన్ ఇండియా ప్రయత్నం మెచ్చుకోదగిందే గానీ అదెంత వరకు వర్కౌట్ అవుతుందనేది భవిష్యత్తులో తెలుస్తుంది. ఎందుకంటే పోస్టర్ చూస్తుంటే డివోషనల్ స్టోరీలా అనిపిస్తుంది. కానీ ఈ జానర్ ఇప్పుడు పాతబడిపోయింది. అదే టైంలో కిరణ్ మార్కెట్ కూడా టాలీవుడ్ వరకే పరిమితం. ఈ నిర్మాత గతంలో తెలుగు హీరో సుధీర్ బాబుతో 'జటాధర' అని ఓ మూవీ చేస్తే అది ఘోరంగా ఫెయిలైంది. మరి ఈసారి ఏం చేస్తారనేది చూడాలి?

# ప్రభాస్ మూవీలో ఛాన్స్.. మీ టాలెంట్ బయటికి తీయండి!



ప్రభాస్‌- నాగ్ అశ్విన్ కాంబోలో వచ్చిన సైన్స్ ఫిక్షన్ మూవీ కల్కి 2898 ఏడీ. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని వైజయంతి మూవీస్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ చిత్రంలో దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, కీలక పాత్రల్లో కనిపించారు. ప్రస్తుతం ఈ మూవీ సీక్వెల్ పనులతో బిజీగా ఉన్నారు నాగ్ అశ్విన్. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి అదిరిపోయే న్యూస్ చెప్పారు మేకర్స్. ఈ చిత్రంలో మీరు కూడా భాగం అవ్వాలని అనుకుంటున్నారా? ప్రభాస్ మూవీలో ఛాన్స్ కొట్టేయాలనుందా? మరి ఇంకెందుకు ఆలస్యం మీ టాలెంట్ చూపించే వీడియోలను పంపండి. ఈ క్రేజీ ఛాన్స్ కొట్టేయండి అంటున్నారు మేకర్స్. తాజాగా ఈ సీక్వెల్ మూవీలో నటించాలనుకునే వారి కోసం క్యాస్టింగ్ కాల్ వచ్చేసింది. ఈ అరుదైన గోల్డెన్ ఛాన్స్‌ను మీ రెండు చేతులతో ఒడిసి పట్టుకోండి. నటనపై ఆసక్తి, ప్రతిభ ఉన్నవారికి ఎలాంటి షరతులు లేకుండా ఈ మూవీ ఛాన్స్ ఇస్తామని మేకర్స్ ప్రకటించారు. ఈ క్రేజీ ఛాన్స్ కోసం తమ వివరాలను, పోర్ట్‌ఫోలియోలను ఝశ్రీఎఱబఅఱజవతీంవఝఱ్‌అఅస్త్రఏస్త్రఝఱఅశ్రీ.ఎశీఎ అనే మెయిల్ చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు. మరి ఇంకెందుకు ఆలస్యం మీలోని టాలెంట్ బయటికి తీసి ప్రభాస్ మూవీలో నటించే ఛాన్స్ కొట్టేయండి.




# పాన్ ఇండియా మార్కెట్‌లోకి కిరణ్ అబ్బవరం

తెలుగు యంగ్ హీరోల్లో కిరణ్ అబ్బవరం ఒకడు. షార్ట్ ఫిల్మ్‌తో కెరీర్ ప్రారంభించి, రాజావారు రాణిగారు' మూవీతో హీరో అయ్యాడు. తర్వాత పలు సినిమాలు చేశాడు గానీ చాలావరకు ఫ్లాపులే. ఎట్టకేలకు 'క' అనే థ్రిల్లర్ సినిమాతో సక్సెస్ అందుకున్నాడు. దీని తర్వాత వచ్చిన 'దిల్‌రుబా' డిజాస్టర్ కాగా.. కె ర్యాంప్, చెన్నై లవ్ స్టోరీ చిత్రాలు సక్సెస్ అయ్యాయి. ప్రస్తుతం ఓ వెబ్ సిరీస్, దర్శకుడిగా ఓ మూవీ చేస్తున్న కిరణ్ అబ్బవరం.. ఇప్పుడు పాన్ ఇండియా వైడ్ తన అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యాడు. 'ఇంద్రపుత్ర' పేరుతో మూవీని అనౌన్స్ చేశారు. సోమవారం ఈ టైటిల్ ప్రకటిస్తూ ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. కాటమరాయుడు, గాండీవధారి అర్జున, కుడి ఎడమైతే, కాంతార ఛాప్టర్ 1 సినిమాలకు పనిచేసిన శ్రీకాంత్ పుప్పాల దీంతో దర్శకుడిగా మారుతున్నాడు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కిరణ్ అబ్బవరం పాన్ ఇండియా ప్రయత్నం మెచ్చుకోదగిందే గానీ అదెంత వరకు వర్కౌట్ అవుతుందనేది భవిష్యత్తులో తెలుస్తుంది. ఎందుకంటే పోస్టర్ చూస్తుంటే డివోషనల్ స్టోరీలా అనిపిస్తుంది. కానీ ఈ జానర్ ఇప్పుడు పాతబడిపోయింది. అదే టైంలో కిరణ్ మార్కెట్ కూడా టాలీవుడ్ వరకే పరిమితం. ఈ నిర్మాత గతంలో తెలుగు హీరో సుధీర్ బాబుతో 'జటాధర' అని ఓ మూవీ చేస్తే అది ఘోరంగా ఫెయిలైంది. మరి ఈసారి ఏం చేస్తారనేది చూడాలి?




## బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న 'ది ఒడిస్సీ'..

# క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లోనే నంబర్ వన్

హాలీవుడ్ స్టార్ డైరెక్టర్ క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల నుంచి భారీ స్పందన అందుకుంటున్న ఈ సినిమా.. ఈ వీకెండ్‌లో ఏకంగా రెండు ప్రతిష్ఠాత్మక రికార్డులను తన ఖాతాలో వేసుకుంది. ముఖ్యంగా నోలన్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలవడం విశేషం. 'ది ఒడిస్సీ' ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా వి1.1 బిలియన్ గ్రాస్ వసూళ్లను అందుకుంది. దీంతో ఇప్పటివరకు క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఉన్న 'ది డార్క్ నైట్ రైజెస్' రికార్డును ఈ సినిమా అధిగమించింది. ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. చైనా, జపాన్ వంటి కీలక అంతర్జాతీయ మార్కెట్లలో సినిమా పూర్తిస్థాయిలో విడుదల కాకముందే ఈ మైలురాయిని చేరుకుంది. ఈ రెండు మార్కెట్లలో విడుదలైన తర్వాత 'ది ఒడిస్సీ' కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.క్రిస్టోఫర్ నోలన్ సినిమాలకు ఐమ్యాక్స్‌తో ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'ది ఒడిస్సీ'తో ఆ బంధం మరో స్థాయికి చేరింది. ఈ సినిమా ఐమ్యాక్స్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ స్క్రీన్ల ద్వారా ఇప్పటివరకు వి289 మిలియన్లు వసూలు చేసింది. దీంతో జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన విజువల్ వండర్ 'అవతార్' జీవితకాలఐమ్యాక్స్ కలెక్షన్స్ అయిన వి271 మిలియన్లను అధిగమించింది. ఇది నోలన్‌కు మాత్రమే కాకుండా ఐమ్యాక్స్ చరిత్రలోనే ప్రత్యేకమైన విజయంగా మారింది. 'ది ఒడిస్సీ'కి ఇంతటి ప్రత్యేకత రావడానికి మరో ప్రధాన కారణం ఉంది. ఈ సినిమా పూర్తిగా ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరించిన తొలి చిత్రంగా నిలిచింది. భారీ స్థాయి విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు, ప్రకృతి దృశ్యాలను సాధ్యమైనంత అద్భుతంగా చూపించేందుకు నోలన్ ప్రత్యేకంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌ను ఉపయోగించారు.థియేటర్లలో ముఖ్యంగా ఐమ్యాక్స్ 70ఎఎ స్క్రీన్లపై ఈ సినిమాను చూసేందుకు ప్రేక్షకులు భారీగా ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో ఐమ్యాక్స్ 70ఎఎ షోలు హౌస్‌ఫుల్ అవుతున్నట్లు సమాచారం.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967